PDF Compressor Pro

# కల్పలత



కవిశేఖర

గురుజాడ రాఘవశర్మ

బృందావన ప్రచురణములు
మచిలీపట్టణము.

PDF Compressor Pro

బృందావన ప్రసూనము ౬.

# కల్పలత

'కిం కిం న సాధయతి
కల్పలతేవ విద్యా'

కవిశేఖర
గురుజాడ రాఘవశర్మ.

PDF Compressor Pro

ప్రథమ ముద్రణము .... 2000 కాపీలు .... మే 1953
ద్వితీయ ముద్రణము .... 1000 కాపీలు .... ,, 1955
తృతీయ ముద్రణము .... 1000 కాపీలు .... జూలై 1964
నాల్గవ — 1500 — 1967

*Approved for use in Libraries by the Director of Public Instruction Andhra Pradesh.*

★

**Prescribed as Text-Book for detailed Study**

| | | |
|---|---|---|
| Andhra University | ... B. A. Part II | 1957 & 58 |
| Sree Venkateswara University | ... B. A. Part II | 1957 |
| Madras University | ... ... B. A. Part II | 1962 |
| Mysore University | ... B. A. & B. Sc. Part II | 1963 |
| Utkal University | ... B. A. ... | 1964 to 1966 |
| Osmania | DOL | 1971 |

స్వామ్యము గ్రంథకర్తవి.

విజయ ప్రెస్,
విజయవాడ-2.

వెల: రు 2-00

PDF Compressor Pro



ఏవనమాలి పెంచి వెలయించెనో
నల్గడలన్ ప్రసిద్ధ బృం
దావన మంచు నా తెనుఁగు
నాటఁ జిగిర్చెను మొగ్గ దాల్చె నె
త్తావులఁ జిమ్మ విచ్చెను; ముదంబుగ
కల్పలతా ప్రసూనముల్
తీవకుఁ దీవ పూచె, సమదృష్టి
రసజ్ఞులు ప్రేమఁ జేకొనన్.

PDF Compressor Pro



# కల్పలత

సూచి :—


వినతి

సందర్శనము

వాత్సల్యము

పోతనామాత్యుఁడు

గోపికాహృదయము

వేఁడికోలు

శ్రద్ధాంజలి

గ్రహస్తవము

కల్పలత

PDF Compressor Pro

# పండితాభిప్రాయములు

మహోపాధ్యాయ, తర్క-వేదాంత సార్వభౌమ

## బ్రహ్మశ్రీ మండలీక. వేంకటశాస్త్రిగారు

మీ 'కల్పలత'ను జూచి చాల యానందించితిని. మీ సహజమగు మృదుమధుర కవితాశైలికి తోడుగ, భక్తిరస మున్పొంగఁజేయు, మీ కావ్య కల్పలత, యే సహృదయుల మనఃపద్మముల వికసింప నానంద ఫలముల నీయకుండును! మీ యిష్టదైవతములగు దయాసముద్రులు, శ్రీకృష్ణభగవానులును అపార కృపావతి యగు శ్రీమాతయు, మీ బృందావన ప్రసూన సౌరభముల నల్దిక్కుల వ్యాపింప జేయుదురుగాత.

ఏలూరు
14-8-53

మండలీక. వేంకటశాస్త్రి.

---

కవిసార్వభౌమ - కళాప్రపూర్ణ

## శ్రీపాద. కృష్ణమూర్తిశాస్త్రిగారు,

మీ కల్పలతా కావ్యము కొంతకొంత చదివితిని. కల్పలత 'కల్పలత' యని చెప్పవచ్చును. అందనేక విషయములు పాఠకులు తెలిసికొనదగినవి యున్నవి. మీ కవిత్వము మనోహరముగా నున్నది.

రాజమండ్రి
9—9—53

శ్రీపాద. కృష్ణమూర్తిశాస్త్రి.

PDF Compressor Pro



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థానకవి

## మధ్వ శ్రీ కాశీ. కృష్ణాచార్యులుగారు

కల్పలతాకల్పము మా
కల్పలతాకవిత మాదు కల్పలతకు మా
కల్పలత సాటియని నా
యల్పజ్ఞతదోచెనట ! యనన్వయమగుటన్.

---

'అభినవతిక్కన' మహోపాధ్యాయ

## శ్రీ దుర్భా. సుబ్రహ్మణ్యశర్మగారు.

మీ పొత్తము నాకుఁ జాల హర్షము కొలిపినది. 'గ్రహస్తవము' తక్క, మీరు గ్రహించిన ఖండములన్నియు రస నిర్వాహమునకు అవకాశము నిచ్చునవి. ఆ యవకాశము జాఱవిడువక మీరు నిర్వహించిన తెఱంగు హృదయంగమముగా నున్నది. నాకు ఓపికయున్న, ప్రతిఖండము, విమర్శించి మిమ్మభినందించి యుందును. కాని యిక, నది యగుపని కాదు. పద్యరచనము, ఎంతధారాళముగా సాగుచున్నది! మీరు అచిరకాలమున బృహద్గ్రంథరచనమునకుఁ దొడంగి, యితోధికమైన యశము నార్జింప వలయునని నా యాశీస్సు. భగత్కృపచే అది సత్యమగుఁ గావుత.

దుర్భా. సుబ్రహ్మణ్యశర్మ.

వెల్లూరు
17-9-53

---

PDF Compressor Pro



మ హా క వి

## శ్రీ గడియారము. వేంకటశేషశాస్త్రిగారు.

( శివభారత గ్రంథకర్తలు )

### అ భి నం ద న ము

కవి తన చూపున కెదురైన విషయమును మధుర భావనా పరిమళితము చేసి వెలువరించిన రసమయ పద్యఘణతులే చాటువులు. విభిన్నవిషయములపై నిట్టి ఘణతులు పుష్పమంజరులుగా గ్రుచ్చిన పూలదండలే చాటుప్రబంధములు. నేఁడీ ఖండకావ్య సంపుటి యీతరగతికిఁ జెందినదే యనవచ్చును. తీరు తీయములైన భావముల విన్యాసముల నొక్కచో నాస్వాదించి యానందించుట కివి రకరకములైన రసాయనములు కాఁగలవు.

'కవిశేఖర' శ్రీ గురుజాడ రాఘవశర్మగారి 'కల్పలత' ఇట్టి ఖండకావ్య సంపుటి. ఇందు 'వినతి' మొదలు 'కల్పలత' వరకుఁ దొమ్మిది భావఖండములు గలవు. అన్నియు రసగుళుచ్ఛము లనఁదగినవి. వీని భావములు పోకడలు నుదాత్తములై తమతమ పేరు నన్వర్థము చేసికొనుచున్నవి. యువక హృదయముల సమ్మోహపఱచి ఉద్రేకము వెంటఁ బరువు లెత్తించు నవికాక, యీ రచనలు వినయ వివేచనలకు, శ్రద్ధాశక్తులకు, శాంతి సత్ప్రవర్తనములకు, భక్తిప్రబోధములకు, పాదులు కట్టునవై, సాహిత్య ప్రయోజనము సాధించుచున్న వనవచ్చును. కనుకనే "కింకింనసాధయతి కల్పలతేవ విద్యా" యను ముఖశీర్షికతో నీ కవి యీ పొత్తమును వెలువరించినాఁడు. ఈనాఁడిది మిగుల వాంఛనీయమనుట గుర్తింపఁదగిన విషయము.

వాసుదేవ నామశతకము, ముకుందమాల, స్వాతంత్ర్యపథము, నవకాళి మున్నగు రచనలో జ్ఞాతాస్వాదమగు శ్రీశర్మగారి శైలిని పాఠకలోకమునకు మరలఁ బరిచయము చేయుట చర్విత చర్వణమే యగును. కాని, ఆ యన్నింటి కంటె నీ రచనలో వీరి శైలి మిగుల నిగ్గుదేఱి లలితమధురముగ నున్నదని నా సంతోషము. శ్రీశర్మగారి లేఖినినుండి యిట్టి యమూల్య రచనలు మఱికొన్ని వెలువడవలెనని యాకాంక్షించుచున్నాను.

గడియారము. వేంకటశేషశాస్త్రి.

ప్రొద్దుటూరు
విజయ శ్రావణ శు ౨౧ లు

## సాహిత్య విశారద, విమర్శక శిరోమణి

## శ్రీ కోన. వెంకటరాయశర్మగారు.

(ఆంధ్రసారస్వత పరిషద్ - కార్యదర్శి)

అను కంపాసహితులరై యనిచిన 'కల్పలత'ను సాంగోపాంగముగఁ బఠించి సంతోషసాగరమునఁ దొప్పఁదోఁగితిని.

మీ 'కల్పలత' వంటి గ్రంథములు సాహిత్యము వినోదార్థమే కాక విజ్ఞానార్థము గూడ నని నిదర్శించుచున్నవి. కవిశేఖరులు యత్నించిన నిట్టి విజ్ఞానదాయక సాహిత్యము నధికముగ వెలయింపఁజేసి ప్రజలలో నార్థిక, నైతిక, చారిత్రక, రాజకీయాది విజ్ఞానము నపారముగఁ బ్రజ్వలింపఁ జేయ వచ్చును.

కావ్యము కాంతా సమ్మితమని చెప్పిన యాలంకారికులు సైతము కావ్యముత్కృష్ట ధర్మబోధ సేయవలెననియే వివరించిరి. ప్రభుసమ్మితములగు వేదములు, మిత్రసమ్మితములగు పురాణములు, గావించు బోధనే కావ్యములు లలితభణితులతోఁ జేయవలెననియే మనపూర్వుల యభిప్రాయము. ధర్మబోధ సేయని కావ్యముల యాలాపములను బరిత్యజింపవలెననియే వారనుటవలనఁ గావ్యములు లోకజ్ఞతను బరిపుష్టి నొందించుననుట సత్యము. అట్టిది మీ కల్పలత. కవి తన వాక్ప్రసారమును రసస్వరూప సంవేదనమునకు సమర్థమగు నట్లు లుపలక్షించునని యిందువలనఁ దేఁటపడుచున్నది.

"అనపేక్షితార్థ విశేషాక్షర రచనైవ బంధచ్ఛాయేతి నేదం నేదయః సహృదయానాం" అని ధ్వనికర్త చెప్పినట్లు పరిపాకముం బడసిన బంధచ్ఛాయ పద్యరూపమందునని తెలియనగుచున్నది. ఆ పద్యబంధమున సంగీత విధి కలదు. శిల్పగానములు సమరసములై కవితయందు భాసించును. ఉపాస్తి రమ్యత కవియందెట్లు భాసించుచున్నదో యవగతముఁ జేసికొనునప్పుడే సహృదయత్వ మభివ్యక్తమగును. మీ 'కల్పలత' యందీ సహృదయత్వ మభివ్యక్త మాచుంటచే నాంధ్ర సారస్వత పరిషద్విచక్షులు, మిమ్ములఁ గవిశేఖరాంకు నొనర్చుట సమంజసము.

బాపట్ల<br>12-8-53

కోన. వేంకటరాయశర్మ.

PDF Compressor Pro



సరసకవి - సాహిత్యరత్న

## శ్రీ మోచర్ల. రామకృష్ణయ్యగారు.

మీ 'కల్పలత'ను జదివి నేనెంతో సమ్మోదము నందితిని. అందలి 'సందర్శనము' 'వాత్సల్యము' నా హృదయము నెక్కువగా, ఆకర్షించినవి. ఆ రెంటి రచనా సంవిధానము మిక్కిలి హృదయంగమము. బాల కృష్ణునిం గూర్చి యాదిభిక్షువు యశోదతోఁ బలికిన పలుకులలో

'విశ్వమంతట నెక్కటి వెలుఁగు వెలుఁగు
ముని మనోగహ్వరముల గ్రమ్మిన వెలుంగు
నేఁడు నీయింటి దివ్వెయై నీకుఁ గనుల
పండువయ్యెను నీ వెంత భాగ్యవతివొ'!

'తిరిపెమునకేమి! పదియిండ్లు తిరిగి తెత్తు
నీల మణివోలె నీయింట డోలనూగు
బాలకునిఁ జూచుటయె నాదు పాలి కమృత
భిక్ష మొసఁగుము కన్నులవిందు నేఁడు'.

ఈ రెండు పద్యములు నాడెందమును బందికొన్నవి. 'వాత్సల్యము' అను ఖండములోని గాథ సౌందర్య లహరిలోని 'తవ స్తన్యం మన్యేధరణి ధరకన్యే'......అను శ్లోకంపు టర్థమునకు మూదలయై రుచిరమై యొప్పారుచున్నది. కడమ శీర్షికల అన్ని పట్టులయందును మీ హృద్య కవితావైశారద్యము విశద మగుచున్నది. మీరింకను రసబంధురమైన గురుకృతులను రచించి యాంధ్రవాణి కలంకృతులుగా సంతరించుట కానుకూల్యమును, ఆయురారోగ్య భోగభాగ్య విభవములను సదాశివుఁ డనుగ్రహించును గాత మని యాశించుచున్నాను.

నెల్లూరు,
7-9-53.

మోచర్ల. రామకృష్ణయ్య.

## 'విద్యారత్న' శ్రీ ఆకిలి. శ్రీరామశర్మగారు, (ముత్తుకూరు)

### కల్పలతాభినందనము

రససిద్ధులగు కవీశ్వరులు సర్వోత్కృష్టులై వెలయుచున్నారని భర్తృహరి పల్కిన పలుకు, అక్షరములా పరమసత్యము.

కేవల గణబద్ధమగు నక్కరముల కూర్పే కవిత్వ మెట్లుకాజాలదో, అట్లే శబ్దాలంకారములయు, పదములయు, నాటోపము కవిత కేక దేశీయమగు శోభ గూర్చునేగాని, రససిద్ధికి సంపూర్ణోపస్కారకము గాజాలదు.

పదబంధ సౌష్టవము శబ్దాలంకారములు అర్థాలంకారములు లేకయు ఒకప్పుడు రసవ్యంజకమగు రచన సాగుట మనకు అనుభవసిద్ధమే.

కవి తన యనుభూతిని భావుకులమనస్సున అచ్చుగ్రుద్దినట్లు స్ఫురింప జేయుటకు ప్రయత్నించును. అతడు తన మనఃపరిభావితమగు విషయమును సంపూర్ణముగ నితరుల మనఃఫలకముల ప్రతిబింబితమగునట్లు చేయుదగిన శబ్దబ్రహ్మపుటావిష్కరణకై తపించును. తపస్సిద్ధిగల యుపాసకుడందు కృతకృత్యుడగును. రసామ్నాయ మహితుడగునట్టి రచయితయే రససిద్ధుడు. ఆతడే వాఙ్మయాకాశమున ధ్రువస్థాయి నందుకొనగలవాడు.

పై నిర్ణయమున కను గలముగ గలము నడపినవాడు, మా గురుజాడ రాఘవశర్మ. వీరి కల్పలత నిజమునకు సర్వధా కవితా కల్పలతయే.

పరిమార్జితమగు రచన - అకలుషితములగు నితివృత్తములు; అఖండమగు ధార కల్పలతకు ప్రోదిగూర్చినవి. ప్రథమ సందర్శనముననే కవి తన ఆత్మ సందర్శనమునకు బునాదులు నిర్మించుకొన సాగినాడు. అద్వైతానుభూతికి అనువగు కథాఖండమును వస్తువుగ నెన్నుకొనినాడు. తన యుపాస్య దైవము గురూణాం గురువు నగు శివుని లీలా విభూతికి ఆకథ రతనంపు బతాకగ జతన పఱచినాడు. లోకమున సర్వసమతయు, అద్వైత భావనయు ప్రబోధించుటకు బాలకృష్ణ సందర్శనమునకై శివుని ఉవ్విళ్ళూరించినాడు. ఆహా! యెట్టి అద్భుత సందర్భము! ఎట్టి ఔచితీ నిర్వాహము! ఓ కవిద్రష్టా! నీ జన్మము ధన్యము! భవద్భావ వినిర్గత కవిత్వము ధన్యతమము!

ఈ కవి విభిన్న శీర్షికలతో ఈ గ్రంథము రచించినను, అఖండమగు కావ్యముంబోలె ఈ శీర్షికలు పరస్పరాపేక్షకములై, అబ్బురముం గూర్చుట ఇందలి మఱియొక విశేషము.

PDF Compressor Pro



భగవ'త్సందర్శనము'నకు సాధనము భక్తి. అట్టి 'వాత్సల్య' భక్తి యైనచో మిక్కిలి మెఱుగు. అట్టి వాత్సల్యభక్తియు, ప్రణయ భక్తియు వెలయించిన భక్తుడు 'పోతనామాత్యుడు'గా పొడగట్టినాడు. భాగవతము నందలి యతని గోపికలు వారిచర్యలు వెంటనే స్ఫురించి 'గోపికాహృదయము' ఆవిష్కరింపబడినది. పిమ్మట గోపికా హృదయస్థుడగు భగవానుని 'వేడికోలు' సాగినది. ఆదిలోన భగవత్సందర్శనము వలె అంత్యమునను (స్వప్నగత) భగవత్సందర్శనముతోడనే కల్పలత కితిశ్రీ చెప్పబడినది. చూచితిరా వివిధ విషయముల కెట్టి యానుపూర్వి అమరినదో!

ఇందు మఱియు నింకొక ముఖ్యమగు ఉపాదేయ విషయమేమన, కవి యితరుల యుబలాటకైనను లౌకికములగు తుచ్ఛవిషయములపై తన కవితా గంగను చిలుకరింపక, అలౌకికములను, ఆధ్యాత్మికములును అగు పవిత్ర విషయములపైననే దృష్టిసారించి తనకవితను దనరును ధన్యతయు మూర్ధన్యతయు చేకూర్చుకొనుట గమనింపదగిన విషయము. 'శివాయగురవేనమః' 'శ్రీకృష్ణాయనమః' అను వీరి నిరంతర జపోపాసనయే కల్పలతా కృతిందాల్చి ఆత్మార్థమును పరమార్థమును ఫలించినవి.

పోతనామాత్య సంస్మరణమునందు - పోతన పలుకుబళ్ళనే పుణికి పుచ్చుకొని పద్యములల్లుట ప్రౌఢికి పరాకాష్ఠ. అట్టి రచనయందాతని పద సంస్మరణము చేయుటలోని విశేషము 'పోతన పదసంపదకన్న మిన్నయగు పదసంపద సమకూర్చుకొనుట ఎట్టివానికిని దుర్ఘటము' మను ప్రహ్వాభావము గూడ సూచించుటకే......'జయన్తి తే సుకృతినోరస సిద్ధాఃకవీశ్వరాః'

ఓ కవిశేఖరా! "ధన్యంబైనది ధన్యమైన దహహా! ధన్యంబు నీ జీవితం
బన్యాలోచనలేల పూర్వకృతపుణ్యాం బిట్లుగా పండె, సౌ
జన్యాన్వీత! త్వదీయ కల్పలతచే సారస్వతాస్థాన మూ
ర్ధన్యత్వంబును చూఱగొంటివి రసార్ద్రస్వాంతు లగ్గింపగాన్.
కలిగన్ లోతగు భావసంపదయు, బల్కన్ నేర్పు, నెన్నెసి జ
న్మల పున్నెమ్ము ఫలోన్ముఖంబయి సుధామాధుర్య చైతన్య ధా
రలు స్వానందరస ప్రవాహమయి జాఱన్ సర్వ విద్వద్వి ని
ర్మల హృత్పద్మములెల్ల విచ్చి విరివారన్ బల్కితో సత్కవీ!"

ముత్తుకూరు,
19-8-53.

ఆకిలి. శ్రీరామశర్మ.

PDF Compressor Pro



'విద్యారత్న' - శతావధాని

## శ్రీ వేలూరి. శివరామశాస్త్రిగారు,

మీ కల్పలత చదివితిని. ఇందలివి, పదములో! పూవులో! భావములో! భక్తియో! ఏమిచెప్పను! కుండనిండినచో ఊరకుండును.

చిరివాడ,
3-9-53

వేలూరి. శివరామశాస్త్రి.

---

ఉభయభాషాప్రవీణ - వేదాంతపారీణ,

## కవిశేఖర - శ్రీ మిన్నికంటి గురునాథశర్మగారు.

మీ 'పొత్తము లన్నింటి సొంతము చదివి కవితారసము నాస్వాదించి యానందించితి. జీవిత పథమున వివిధ రుచుల నుపభోగించితిరి. కవితలో వివిధరుచుల విలువరించితిరి.

అది గోపికా హృదయమా! రాఘవ హృదయమా? అబ్బా! 'తెలియంజాలని దొడ్డవాఁడవఁట' ఈ పద్యమొక్కటి చాలదా మీ పరిణత బుద్ధికి.

"నా హృదయం బెఱుంగు......" ఈ పద్య మొక్కటిగాదా సర్వ వేదాంతములఁ బండిన సారము.

"సందర్శనము" తెలుగుఁ బలుకు బళ్ళతో నెంత రమణీయముగా నున్నది! ఏల పెక్కులుః— ఎదురుతగులని గమనము. రసముజిప్పిలు కవనము.

చ. పలుకులు పచ్చకప్పురపుఁ బల్కులు - ధారలు కమ్మ యచ్చు బా
రలు, రసముల్ సుధారసతరంగము - లయ్యతి వృత్తముల్ జనా
వళి హృదయాత్తముల్ - సుపదబంధము లబ్జసుమానుబంధముల్
బళి! గురుజాడ వంశ్య కవివర్యుని కావ్యము లార్యసేవ్యముల్.

గుంటూరు,
19-8-53

మి. గురునాథశర్మ.

PDF Compressor Pro

## కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ. సత్యనారాయణగారు.

కవిత్వానికొక ఆవేశం కావాలి. గ్రంథరచనకు కొంత చదువుకోటం కొంత పట్టుదల కావాలి. ఆవేశం అనేకవిధాలుగా వస్తుంది.

ఇందులో ప్రథమావేశ లక్షణం భక్తి. కృష్ణుడు కాని, అమ్మవారు గాని ఈ ఆవేశానికి ప్రథమ స్వరూపాలు. ఇందులో ఉన్న రహస్య మేమిటంటే భగవంతుణ్ణి గురించి యెట్లా వ్రాసినా కవిత్వమల్లేనే ఉంటుంది. అక్కడ కవి చేయవలసినదల్లా గణయతి ప్రాసలు కూర్చడం. మరీ కృష్ణుణ్ణి గురించి సర్వసామగ్రియు కవితామయంగా ఉంటుంది. కవిత్వంయొక్క ఉత్తమ లక్షణం యేమిటంటే సాధకునికి ఆస్వాదనా యోగ్యంగా ఉండటం. భగవంతుణ్ణి గురించి యే భావమైనా యీ యోగ్యతా విరహత్వాన్ని పొందదు. సృష్టిలో నూటికి తొంబది తొమ్మిదిమంది కవులు కవిత్వాన్ని యిట్లా మొదలు పెట్టినవారే. మరి ఔత్తరాహులైన కవులు సూరదాసు, తులసీదాసు, మీరాబాయి, మొదలైన వాళ్ళందరు ఈ యావేశంలోంచి కవులైనవారే. పైగా ఈ కృష్ణుడు, రాముడు వీరిని గురించి మహాకవులు పూర్వం పాడారు. ఆ భావాలు తీసికొని మనం చెప్పినా కవిత్వం అవుతుంది. మనవంతేమిటంటే, పద్యరచన చక్కగా చేసికోటం.

శ్రీ గురుజాడ. రాఘవశర్మగారికి ఈ భక్తితోపాటు మరి రెండు వెసులుబాట్లు కలిగినవి. ఒకటి కాంగ్రెసులో ఉండి జైలుకివెళ్ళి దేశభక్తి గీతాలు వ్రాయటం. ఇది ఒక దోహదం. రెండవదోహదక్రియ యేమిటంటే బందరు ఇంగువకట్టినగుడ్డ. గురువర్యులు శ్రీ చెళ్ళపిళ్ళ. వేంకటశాస్త్రిగారి వాసన ఆయూరికి పోలేదు. ఈ మూడు హేతువులుగా రాఘవశర్మగారు కవియైనాడు. కవియేకాదు కవిశేఖరుడైనాడు. ఈ మూడు లక్షణాలు వీరి యీ కల్పలతయందు సమృద్ధిగా కనిపిస్తున్నవి. పద్యం సుకుమారంగా మధురంగా వ్రాయడం ధారాశుద్ధిలో లోపంలేకుండా వ్రాయడం, బందరులో పుట్టిన కవులకు వెన్నతో బెట్టినవిద్య. రాఘవశర్మగారికి భగవద్భక్తి పూర్వజన్మ సంస్కారవిశేషం. ఇందులో ఏపద్యం చూచినా మెత్తగా మధురంగా ఉంటుంది. యతి ప్రాసలకోసం వెతుక్కోటం ఉండదు. మనం మాట్లాడుతూ ఉన్నట్లు ఉంటుంది. ఈ మార్గాన్ని శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు దేశానికి ప్రసాదించి వెళ్ళారు.

ఇందులో వేడికోలు అన్న శీర్షికతోడి పద్యాలు చాలహృదయంగమంగా ఉన్నాయి. వీరి కవిత్వానికి పరాకాష్ఠగా ఉన్నవి. హృదయావేదన

PDF Compressor Pro



దీనియందు మిక్కిలి రమ్యంగా ఉన్నది. శ్రీ రాఘవశర్మగారిని ఎఱిగిన వాళ్ళకు ఆయన యింతటి చక్కని గ్రంథం వ్రాశాడంటే ఆశ్చర్యం ఏమీ లేదు. ఆ 'వేడికోలు' పద్ధతిలోగాని, మఱియింకొక ఉన్నతమైన పద్ధతిలోగాని, వీరి చేతినుండి ఉత్తమ గ్రంధాలు రావడానికి చాలా వీలున్నది. వస్తవని యెదురు చూస్తున్నాము.

విజయవాడ<br>
25-8-53 } విశ్వనాథ. సత్యనారాయణ.

పూజ్యులు

## శ్రీ ఈశ్వర. సత్యనారాయణగారు.

(శ్రీ కాకుళము)

కోరున త్తరుతావి గ్రుమ్మరింపఁగఁజాలు<br>
చతురైంద్ర జాలి హస్తమ్మెయౌచు<br>
కాపుచంకలు గ్రుద్దఁగాఁ జేయుచున్ బెక్కు<br>
రంగుల నీను శక్రధనువౌచుఁ<br>
దన పనులెల్లనున్ ధవు తన్వికే తగి<br>
యుండఁ జూచెడి సాధ్వి యుల్లమౌచుఁ<br>
గనఁబడు వస్తువెల్లను నోరి నూరించు<br>
కాశీ మిఠాయి దుకాణ మౌచుఁ<br>
దనదు నామమె చదువరి మనము నెన్నొ<br>
విధములం దన్ప నంచును వెల్లడించు<br>
లలిత కవితాఢ్య! మీ కల్పలతను జేరి<br>
రాత్రియంతయుఁ బుచ్చినా వ్రాసిన దిది.

కవిత తెనుంగున నిగ్గతి<br>
ని వెలయఁదగుఁ జూడుఁడంచు నేర్పెడు గురుజా<br>
డ వెలయు నీ తీయనుడుల్<br>
రవళిం బొలుచు గురుజాడ. రాఘవశర్మా!

స్ఖాలిత్యంబులు లేనివాఁ డెవఁడు! నీ కావ్యంబుఁ గైకొన్నచో<br>
దోలాందోలిత బాలుఁడై సుఖఝురిన్ దోఁగాడుచు న్బాధకుం<br>
డే లీలంబడు రంధ్రమార్గణమునం, దీ నీకవిత్వంపు వా<br>
గ్జాలాంచ త్సుధఁ గ్రోలియంటి; స్తవవాక్యంబింతయున్ గాదు సూ.

PDF Compressor Pro



## విద్వాన్ శ్రీ గంటి, జోగిసోమయాజిగారు. ఎమ్. ఏ. ఎల్. టి.

ప్రొఫెసరు ఆంధ్రభాషా శాఖాధ్యక్షుడు,
ఆంధ్ర విశ్వకళాపరిషత్తు.

శ్రీ గురుజాడ రాఘవశర్మగారు రచియించిన 'కల్పలత' యను కావ్యమును మిక్కిలి యానందముతో జదివితిని. తెలుగు నుడికారమును వెలయించుచు మృదుమధురమయిన శైలిలో నిట్టి రసవంతమైన రచన వ్రాయ గలిగిన కవిగారి నభినందించుచున్నాను. కవితా విషయముగూడ నుత్తమ శ్రేణికిఁ జెందినది. ఈ గ్రంథము తప్పక యాదరింపదగినది.

విశాఖపట్టణము
18-11 53.

విద్వాన్ సోమయాజి.

---

పూజ్య శ్రీ
## విస్సా. అప్పారావు పంతులుగారు.

మీరంపిన 'కల్పలత' గ్రంథమును జదివితిని. మీ కవిత్వము మృదుమధురమై మనసు రంజింపజేయుచున్నది. మీ రచనలో భావమును తరుముకొని భాషయును, భాషను తరుముకొని భావమును, నేను నేనని బరుగులిడుచున్నవి. ఇది పూర్వపుణ్య విశేషము. ఈ విషయము నేగదా 'వాత్సల్యము'లో మీరు చిత్రించియున్నారు.

'సందర్శనము'లోని "చక్కని వాడిటువంటి వాని మే మెక్కడ జూడమంచు" వంటి కొన్ని పద్యములు, పోతనామాత్యుని లోనివి కొన్ని, 'శ్రద్ధాంజలి'లోని సీసపద్యము మొదలైనవి జనరంజకములై, ఆనోట ఆనోట నిలిచి పోగలవని నమ్ముచున్నాను.

సరస్వతీ కటాక్షముచేత, మీకవిత్వ మింకను ప్రౌఢతరమై, నూతన మార్గములనుబట్టి విరాజిల్లు గాక !

విశాఖపట్నము,
26-9-53.

విస్సా. అప్పారావు.

PDF Compressor Pro



## శ్రీ ఖండవల్లి. లక్ష్మీరంజనంగారు. ఎం. ఏ.

ఆంధ్ర శాఖాధ్యక్షుడు - ఉస్మానియా విశ్వవిద్యాలయం.

శ్రీ గురుజాడ రాఘవశర్మగారు వ్రాసిన 'కల్పలత' యను ఖండ కావ్యముల సంపుటిని చదివితిని. వీనిలో 'సందర్శనము' 'వాత్సల్యము' అను శీర్షికలు గల కావ్యఖండికలను, తమ పితృదేవునకును, 'కల్పలత' యను దానిని పితృదేవతలకును గృతి సమర్పణ చేసి, ఈ కవి పితౄణమును దీర్చికొని, నేఁటి కాలమునం దపురూపమైన యాస్తికబుద్ధిని ప్రకటించుకొనెను. 'గ్రహస్తవము' కేవల సాహిత్యప్రియులకు రుచింపకపోయినను శివేతరశక్తికి లక్ష్యము కాగలదు. ప్రాచీనుల మతమున నిదియు కావ్యప్రయోజనములలో నొకటి గదా! 'సందర్శనము'నందు యశోద మాతృవాత్సల్యమున, శివకేశవుల యన్యోన్యారాధ్యత్వమును; వాత్సల్యమునందు బాలుని మాధుర్యమును, ద్రవిడ శిశువును మహాకవిగా నొనరించిన శ్రీ దేవీ స్తన్యపాన ప్రభావమును; రాఘవ శర్మగారు రసవంతముగా చిత్రించిరి. 'వేడికోలు' 'గోపికాహృదయము' అను కావ్యములందు కవిగారి భక్తిహృదయము ప్రకటితమగుచున్నది. భగవంతుడును, భక్తుడును ఒండొరులయందు నిక్షిప్తులని వీరు సూచించుట యుక్తముగా నున్నది. 'తెలియంజాలని దొడ్డవాడవట' యను గోపికాహృదయ పద్యము, ఈ కవి శైలి సలక్షణమై ద్రాక్షాపాకమై యక్కడక్కడ గడుసుపోకడలు కలిగి యొప్పుచున్నది. మచ్చునకు

'ఇలఁ జిరకాల వాసన ఫలింపఁగ నెల్లెడ నల్లుకొన్న, యీ
బలితపు పాదునందు, బరిపాటి ననల్ కొనలేచి, నల్గడల్
దళముగ తీవదొంతరలు, దారులు మూయుచు, గట్టెడున్ బొదల్
కలుగునె! మూలముట్టుగఁ బొకాలెడు కాలము నానతీగదే'!

సత్సంతానము జీవితపు కల్పలత, యని, 'వాత్సల్యము' 'కల్పలత' యను శీర్షికయందు వీరు చిత్రించుట సాంసారికులకుఁ దృప్తినొసంగునదిగా నున్నది.

కథాత్మకములును వ్యాప్తిశీలములునగు ఇతివృత్తములను చేబట్టి ఈ కవిగారు తమ కవితాశక్తికి మెఱుగు పెట్టుకొందురని ఆశింతును.

30—10—53. ఖండవల్లి. లక్ష్మీరంజనం.

PDF Compressor Pro

ఓం

# క ల్ప ల త

మదరాసు విశ్వవిద్యాలయాంధ్ర శాఖాధ్యక్షుడు.

శ్రీ నిడుదవోలు. వేంకటరావుగారు. ఎమ్. ఏ.

ఒక గురుజాడ కవిశేఖరుఁడు, కొన్ని యేండ్లవెనుక 'క్రొత్తప్రాఁతల మేలుకలయిక క్రొమ్మెఱుంగులు' చిమ్మ ముత్యాల సరములచే నతిలోక మధురమూర్తి యగు నాంధ్రభారతి నలంకరించెను. నేఁడు వేఱొక గురుజాడ కవిశేఖరుఁడు, స్వకీయ కవితా బృందావనము నందలి కమనీయ కల్పలతా ప్రసూన మాలికచే తెనుఁగు దల్లి యడుగుఁ దమ్ముల నలంకరించినాఁడు. విజయవైశాఖలో వెలసిన యీ కల్పలత ముఖపత్రమున మోహనమూర్తియగు మురళీ కృష్ణుని చిత్రము గలదు. చిత్రముక్రింద కవిపేరు, కల్పలతాకావ్య మురళీరూపమున కవి కవితా గాన మొనరించుట ధ్వనింప జేయుచున్నది. రెండవ పుట లోని 'కింకిం నసాధయతి కల్పలతేవ విద్యా' అను వాక్య మిప్పటి కేఁబదియేండ్ల క్రిందట యాచంట సాంఖ్యాయన శర్మగారు ప్రకటించిన 'కల్పలత' పత్రికను జ్ఞప్తికిఁ దెచ్చినది. విబుధ లోకంబు 'కవితైవవిద్య' యను నప్పకవి వాక్యము నప్పుడే స్మరణకుఁ దెచ్చినది.

వినతి, సందర్శనము, వాత్సల్యము, పోతనామాత్యుఁడు, గోపికా హృదయము, వేడికోలు, శ్రద్ధాంజలి, గ్రహస్తవము, కల్పలత యనుః నవ ప్రసూనములచేత నీ కృతి ప్రణేత నవ్య కవితారామమును గుబాళింపఁ జేసి యున్నాఁడు. వాగ్దేవతా కరుణాకటాక్షమున, నవారిత నిర్మలగాంగ ఝరీ సమానమగు నవ్యదివ్య కవితారస ఝాగ్ఝరి' పొంగి పొరలుచున్నను, కవి వినీతిమెయి వినతినిఁ బ్రకటించినాఁడు. సందర్శనమున, దివ్యమగు త్రివర్ణ చిత్రముతో గూడ, యశోదమాటలు, కృష్ణుని చేష్ట, శివుని పలుకులుఁ నను ముత్తెఱంగుల పద్యముల మురువును కన్నుల యెదుట కట్టినట్లుండి, మనమున హత్తుకొన్నవి. * 'శ్రీ వాగ్దేవి' వాత్సల్యముఁ బడసిన కవి యీ శీర్షికలో

*శ్రీ - లక్ష్మీదేవి.<br>
వాక్ - సరస్వతీదేవి.<br>
దేవి - దుర్గాదేవి.<br>
} శ్రీ వాగ్దేవి......దేవీ త్రయాత్మకము.<br>
శ్రీ వాగ్దేవి......సరస్వతీ పరము-శోభాయుక్తమైన వాగ్దేవత.

PDF Compressor Pro



నామె, యమేయ వాత్సల్యమును ననుపమేయముగాఁ జిత్రించి యున్నాడు. ఇక పోతనామాత్యునియందు కవి లీనమై తన కవితాశక్తిచే నా భక్తాగ్రేసరుని 'బ్రహ్మ కూకటి ముట్టించు పలుకుఁ జిలుకు, పూజ్యతేజోవిరాజు మా పోతరాజు'ను మన హృదయ ఫలకములయందు ప్రత్యక్షముచేసి యున్నాడు.

అనన్యసాధ్యమగు పోతనను నాతని సూక్తులతో ప్రశంసించుట యాతనికి నైవేద్యము. నిత్యసంస్మరణ. పూతహృదయ భావములతో పోతనను గూర్చి యీ కవిచేసిన రచన యాతని కవిశేఖరత్వమును సార్థకము నొనర్చుచున్నది. గోపికాహృదయము నందలి మధురభావ మద్వైత వేదాంతముతో సమన్వయము నందుచున్నది. శ్రద్ధాంజలియందు, కవి పరమేష్ఠియందు, కవికి గల గౌరవము సువ్యక్తము చేయుచున్నది.

రాఘవశర్మ ప్రాత క్రొత్తల నిందు రమణీయముగ సమ్మేళనము చేసి నందులకు నవగ్రహస్తవ మొక తార్కాణ. ప్రాచీనులలో పదునైదవ శతాబ్ది నొక్క గౌరనమాత్రము ప్రత్యేకముగ నవగ్రహస్తవ మొనరించినట్లు తెలియుచున్నది. ఈ వెనుక కీర్తిశేషులు విక్రమదేవవర్మ మహారాజుగారొక నవగ్రహస్తవమును రచియించియున్నారు. కాని నవీన భావుకులలో నెవ్వరును దీనిని ప్రత్యేకముగ రచియించినట్లు గానరాదు. రాఘవశర్మ రచనము ప్రాచీనుఁడగు గౌరన రచనతో తులతూగుచున్నది. పితృదేవతాళికి కావ్యము సమర్పించుట ప్రాచీన సంప్రదాయమే.

ఇందలి పద్యరచన యెంత లలితము, మనోరమమో గ్రంథముయొక్క యాకృతి, చిత్రములు, నంతమనోజ్ఞములై, పాఠకలోకము నాకర్షించుచున్నవి. గ్రంథమునం దంతట, కవి రచనా కౌశల్యము, ప్రతిభ, సాత్త్విక భావ ప్రకృతి, పితృమాతృభక్తి తత్పరత, వెల్లివిరియుచున్నవి. రాఘవశర్మ రసోల్లసితమై 'లలితంబై, సహృదయాహ్లాద ప్రదం' బైన యీ కల్పలతా ప్రసూన గుచ్ఛము నందించినాడు. ఇతోధికముగ, నీ బృందావన గ్రంథమాల నుండి రమణీయార్థ ప్రతిపాదకములగు రాఘవశర్మ కృతులు వెలువడు గావుత.

ఇతి శివమ్.

PDF Compressor Pro



మైసూరు విశ్వవిద్యాలయాంధ్ర శాఖాధ్యక్షుడు

## విద్వాన్ కె. సుబ్బరామప్ప. యం. ఎ., బి. యిడి.,

'కల్పలత' ను మావిశ్వవిద్యాలయమున, 1961-63 సంవత్సరములలో బి. ఏ., బి. ఎస్‌సి. తరగతులకు 'మాడరన్ పొయట్రీ' పాఠ్యగ్రంథముగా నిర్ణయించితిమి.

ఇందులోని ఖండికలను మా విద్యార్థులు చదివి అందలి అంతరార్థములను ఆశయములను గ్రహించి ప్రయోజకులైరి.

పద్యముల నడక హృద్యముగనుండి చక్కని శిల్పముతో అమరియున్నది. నిసర్గధారాళశైలిలో కవిత సాగినది. వీరికి నా ధన్యవాదములు.

ఇట్లు

బుధజనవిధేయుడు,

కె. సుబ్బరామప్ప.

మైసూరు
13–4–64

---

పూజ్య శ్రీ

## దీపాల. పిచ్చయ్యశాస్త్రిగారు.

తాము దయతో నాకంపిన 'కల్పలత' అందినది. ఆమూలాగ్రము పఠించితిని. 'శారదా సాదర కరుణా కటాక్షములం బొంగిన మీ నవ్య దివ్య కవితా రసవార్ధి' లో నోలలాడి, యత్యంతమానందించితిని.

మీ కవితారీతులు సరిక్రొత్తలు. మీ కల్పనా కౌశలము ప్రశంసనీయము. పోతనాదికవుల పలుకుబడుల నందుకొని, మీ పద్యములలో, మీరు పొదిగిన విధము మిక్కిలి హృద్యము.

మీ రచనలు, ఈనాటి యువకవులకు, పూర్వ సంప్రదాయములను వదలని యొక్క చక్కని నూతన మార్గమును చూపుచున్నవి.

దీపాల. పిచ్చయ్యశాస్త్రి.

వరకవిపూడి, నెల్లూరుజిల్లా
23—12—53

PDF Compressor Pro



## శ్రీ డాక్టరు గిడుగు. సీతాపతిగారు. బి.ఎ., ఎల్.టి.డి. (లిట్)

(కైరటాబాద్, హైదరాబాదు-4.)

కవిశేఖరా! మీరు దయతో పంపిన మీ 'కల్పలత' నాకు చేరి చాల కాలమయినది. కాని ఇతర కార్యముల ఒత్తుడువలన, మీ గ్రంథమందినది అనినైనా లేఖ వ్రాయలేకపోయినాను. క్షమింపుడు. మీ కావ్యసంపుటిని గూర్చి నా అభిప్రాయము తెలియజేస్తున్నాను. 'వినతి'లో "అందఱు తరియించుమేటి కవితల్ పలికింపుసదా సరస్వతీ," అని మీరు గావించిన ప్రార్థనము పూర్తిగా సఫలమయినది. 'వినతి' మొదలు 'కల్పలత' వఱకును గల నవఖండము లందును, మీరు కోరినట్టుగా సరస్వతి మీనోట పలికించినది. అంతేకాదు కడపటి పుటలో "ప్రసరింపంగదె నీ యనుగ్రహము నాపై వారిపై శారదా' అని మీరు గావించిన ప్రార్థనముకూడ మెండుగా సఫలమయినది. అందుకు మీ కల్పలతా కావ్య సుతను మెచ్చుకొనిన మేటి పండితుల యభిప్రాయములే తగిన నిదర్శనములు.

మీ కావ్యమందలి 'సందర్శనము', 'వాత్సల్యము' అను పేరనున్న ఖండికలు రెండున్నూ, మీతండ్రిగారికిన్ని 'కల్పలత' అను పేరనున్న ఖండిక మీ పితృదేవతాళికిన్ని సమర్పించుట సమంజసము. యావత్ కృతి సమర్పణము శ్రీకృష్ణునికి గావించుట కడు యోగ్యమైనది. మీ రచనలో పదలాలిత్యము నర్థగౌరవము భావప్రౌఢి మొదలుగాగల సద్గుణములు సంభావింపదగినవి. సరస్వతీ కటాక్షమున మీరింకా ఇంతకంటెను మేలయిన కావ్యములను రచింతురుగాక.

మీ కావ్యమును చదివినప్పుడు నేనానందపరవశుడనై రచించిన శ్లోకములను మీ కందజేస్తున్నాను.

గోపాల బాలస్య మనోజ్ఞమూర్తిం
ద్రష్టుం శివోభిక్షుక వేషధారీ
యథా యశోదా మను సృత్యధన్య
స్తథా భవత్వం కవిమార్గ చారీ.

దేవ్యై క్షీరం ప్రణిహితధృతిం తీవ్రభక్త్యార్పయంతం
బాలందృష్ట్వా సదయహృదయా సుప్రసన్నా దదౌయా

PDF Compressor Pro



స్తన్యం తస్మై అమృత సదృశం తత్ పరిష్వంగ పూర్వం
దేవీ సైవం మధురకవితా స్తన్యమాదాదదాతే.

అహో! తే చాతుర్యం ! యదల మధునా పోతనకవేః
వచోరీత్యా భక్త్యా మధురరచనాం కర్తుమతులామ్
యదాతత్ కైవల్యం వరమితి భృశం పోతన ఇవ
త్వమీప్సే ర్ధ్యానంతే భవతి సులభం రాఘవకవే !

త్వం గోపికాయాః హృదయే వసంతీం
అద్వైత భక్తిః మధురాంచభక్తిమ్
ద్రష్టుంసమర్థః సహజోపలబ్ధ్యా
ధన్యోఽసి భో । రాఘవశర్మ సూరే !

భక్త్యాఽకృష్ణో వసేత్ తే హృదయ సరసిజే రాగబద్ధోరమేశో
లక్ష్మీవాణీభవానీశ్రియ మురుధిషణాం సౌఖ్యముద్దీపయన్తు
లోకే సర్వే రసజ్ఞాః సురుచిర కవితా మాద్రియంతాం త్వదీయాం
ఉత్కృష్టప్రార్థనా తే సులభసఫలతాం శీఘ్ర మాప్నోతుధీమన్

స్వభావసిద్ధా కవితాకళా తే । స్వదేశభక్త్యా గురుదేవభక్త్యా
శ్రీచెళ్ళపిళ్ళస్య కవిత్వగంధం । తన్తస్య తే కల్పలతా ప్రబంధే.

త్వాం దృష్ట్వాఽథ నవగ్రహాః కరుణయాదాతుం వరాన్ తేశుభాన్
“కింకిం కాంక్షేః కథ యేతియద్యభిరతాః పృచ్ఛేయు రేవంతదా
యేవోయద్యదలం ప్రదాతుముచితం యాచేతదేవగ్రహాన్”
ఏవం త్వంకథయేరితి స్వయ మహం సంభావయామి ప్రియమ్.

సూర్యశ్చ చంద్రశ్చ కుజశ్చ రాహుః
గురుశ్చ సౌరి ర్బుధ కేతు శుక్రాః
అవన్తుతే త్వాం గురుజాడవార్ధి
తారాపతే ! రాఘవశర్మ సూరే !

స్వప్నాంశ ఏష ఇతి తే జననీ విచింత్య
ప్రీత్యాస ఏవహి శుభప్రద ఇత్యవాదీత్
ఏవం ఫలన్తు సకలాశ్చ మనోరథాస్తే
కింకింనసాధయతి కల్పలతేవవిద్యా.

PDF Compressor Pro



## "కరుణశ్రీ"

## శ్రీ జంధ్యాల. పాపయ్యశాస్త్రిగారు.

నవ నవ ప్రసూన విరాజితమైన మీ "కల్పలత" హృదయంగమముగా ఉన్నది. "సిగముడిగంగలేదు" "తమ్ముల నేలు కన్నులు" "ద్వారమ్ము దెఱువ" "ధన్యంబైనది" ఇత్యాది రసగుళికలవంటి కళాకళికలు మీ 'కల్పలత" కోమలతకు ఉజ్వలతకు ఉదాహరణాలు. మీ రచనా విన్యాసము "లలితంబై రసవంతమై సహృదయాహ్లాద ప్రదంబై" విరాజిల్లుచున్నది.

మీ కవిత కమనీయమైనది. మీ కవితా సరస్వతికి "శ్రీరస్తు - చిరాయురస్తు."

ఏ. సి. కాలేజి,<br>
గుంటూరు.

మీ<br>
"కరుణశ్రీ"

---

## పూజ్య శ్రీ

## కాటూరి. వేంకటేశ్వరరావుగారు.

మీరు పంపిన 'కల్పలత' అందింది. మీ పూర్వపుణ్యం మంచిది. ఈ వఱకు తెలుగు నేతలే బాగున్న వనుకుంటే ఈ స్వతంత్ర రచనలు మరీ రుచిగా ఉండి నోరూరిస్తున్నవి. పోతన్నగారి ధార మీకు పట్టుబడుటే కాక ఆయన భక్తి పారవశ్యం కూడా పట్టువడింది. మఱి లోపమేముంది! అన్నింటిలోనూ గ్రహస్తవం చదువుతూంటే నాకు భోజరాజీయంలో ప్రయాగ ఘట్టంలో దూకిన బ్రాహ్మణుని కోరికలను చెప్పే నాలుగు పద్యాలు జ్ఞాపకం వచ్చినవి. 'అందఱు తరియించు మేటికవితల్ పలికించు సదా సరస్వతీ' అని మీరు ప్రార్థించితిరి. అవి నిజమయ్యే లక్షణాలు గ్రంథమంతటా గోచరిస్తున్నవి.

కాటూరు,<br>
16–10–53.

కాటూరి. వేంకటేశ్వరరావు.

★

రస లుబ్ధుల్, గుణలేశతోషితులు
హర్షస్వాంతులై, సత్కృపా
రసమున్ జిల్కు మహానుభావులు, కవుల్
ప్రజ్ఞాన్వితుల్ నాదు కా
వ్యసుతన్ గల్పలతన్ దయామతిని
సంభావించు టబ్రహ్మగున్
ప్రసరింపగదె! నీయనుగ్రహము
నాపై, వారిపై శారదా!

★

PDF Compressor Pro



# ప్రసూనములు

## శ్రీ వాసుదేవనామశతకము (తృతీయ ముద్రణము)

శ్రీ కృష్ణాష్టోత్తర శతనామముల ననుసరించి యొక్కొక్క పద్యమునం దొక్క నామార్థమును గూర్చి వ్యాఖ్యానప్రాయముగా వ్రాసిన భక్తి ప్రబోధాత్మక శతకము. రు. 0_50

## ముకుందమాల (తృతీయ ముద్రణము)

శ్రీ కులశేఖరాళ్వారుల సంస్కృత ముకుందమాల కనువాదము.
60 మూలశ్లోకములు, పద్యములు, తాత్పర్యసహితము. రు. 0_75

## నవకాళి (మహాత్ముని అహింసా విజయయాత్ర)

భీభత్స, భయానక, కరుణారస ఖండకావ్యము. రు. 0_37

## కల్పలత (తృతీయ ముద్రణము)

వినతి, సందర్శనము, వాత్సల్యము, పోతనామాత్యుఁడు, గోపికా హృదయము, వేడికోలు, శ్రద్ధాంజలి, గ్రహ స్తవము, కల్పలత మొదలగు నవశాఖలు విరాజిల్లు ఖండకావ్య సంపుటి. రు. 2_00

# రాబోవు గ్రంథములు

1. సిద్ధేంద్రయోగి నాటకము
(కూచిపూడి భరతనాట్య గురువులును, ప్రసిద్ధ కవీంద్రులు నగు సిద్ధేంద్రయోగి జీవిత చరిత్ర).

2. జాతీయోద్యమ పద్యములు - గేయములు
స్వాతంత్ర్య సంపాదనకుముందు, తదుపరి భారత జాతీయోద్యమము, ఆంధ్రోద్యమమును గురించి ఉత్సాహము పురికొల్పు పాటలు, పద్యములు.

3. జాతీయజీవనపద గేయసంపుటి

4. భక్తిరసైకస్తోత్ర సంపుటి

PDF Compressor Pro

# ప రి చ య ము

## శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు ఎం. ఏ.

శ్రీ గురుజాడ రాఘవశర్మ ఇదివరకే అనేక గ్రంథములు వ్రాసి ప్రకటించి కవిశేఖరుడను బిరుదముతో ప్రసిద్ధికెక్కిన కవీశ్వరుడు. స్థిరయశుడైన యీతని నూతన రచనలకు ఇతరుల పీఠికలు అనావశ్యకములేగాక అపేక్షణీయములును గావు. ఈ సంగతి యెంత నొక్కిచెప్పినను ఇతని మనసున కెక్కదు. వయస్సునుబట్టియో ప్రచారమునుబట్టియో అహంకారమునుబట్టియో దేశములో పెద్దపేరు సంపాదించిన వారెల్లరు తనకంటె అనేక విధముల పెక్కుమడుగుల అధికులనియు అట్టి వారిచే పీఠికయను పేరుతో నాల్గువాక్యములు వ్రాయించి, వానిని తనకు తన కావ్యమునకు దీవనలుగా గైకొనవలెననియు ఇతనికి కుతూహలము. ఇదియొక చిత్రమైన భ్రమ. ఆ భ్రమను తొలగింపలేక, యితని మాటను త్రోసిపుచ్చలేక, యితడు నాయెడ చూపు పెద్దతనమును కాదనలేక మైత్రినిపాటించి యీ పరిచయ వాక్యములను వ్రాయుచున్నాను.

అపరిచితుడైన వాని కావ్యమునకు ఉపోద్ఘాతము వ్రాయుట యెంత సుకరమో పరిచితుడైన వాని కావ్యమునకు వ్రాయుట అంత దుష్కరము. ఈ రెండవవాని స్వభావచరితములలోని మంచిచెడ్డలు మనసున హత్తియున్న పీఠికకర్త వానిని విస్మరించి శుద్ధ తటస్థభావముతో కావ్యముయొక్క మంచిచెడ్డల గూర్చి ప్రసంగించుట ధర్మమేయయ్యు అసాధ్యము. కాని కావ్యగత భావములు కవిస్వభావాను గుణము

PDF Compressor Pro



లగునా కాదా యనెడి యంతశ్శుద్ధి పరీక్షలో పూర్వపరిచయము ఎక్కువ యుపకరించును.

రాఘవశర్మతో నాకుగల పరిచయమునుబట్టి యీ కల్పలతలోని ప్రతిఖండము, ప్రతిపద్యము, ప్రతివాక్యము, అంతశ్శుద్ధిద్యోతకమే కాని కృత్రిమమును బూటకమును కాదని త్రికరణశుద్ధిగా చెప్పగలను.

ఇతడు పరమ పవిత్రుడైన జీవి. నిరంతర పారమార్థిక చింతతో జీవయాత్రను సాగించు నిత్యసంతుష్టి. భక్త్యావేశ పూరిత హృదయుడు. హృదయము భావభరితమైనపుడు ముక్త కంఠముతో పద్యగానము చేయుచు తన్నుతానే మరచు భక్తి లోలుడు. మరియు నీతని భక్తి విస్తృతవ్యాప్తిగలది. పూజ్యత గల విషయము లన్నియు నితనికి ఆరాధనీయములే. అందు చేతనే యితడు ఒక భగవద్భక్తుడే గాక గురుభక్తుడు, దేశ భక్తుడు, గాంధిభక్తుడు, పితృభక్తుడు, మాతృభక్తుడు, గోత్ర భక్తుడుగా నెగడి భక్తిమయ జీవియై కాలము గడుపు చున్నాడు. ఇట్టివానికి పుణ్యవశమున కవితావిద్యగూడ లభించినది గనుక అర్చనీయులైన వారినెల్ల పద్యములతో నర్చించి తన కవిత్వమునకు సార్థకతను, తన జన్మకు సఫలతను ఆర్జించుకొనుచున్నాడు. విశేషించి యితనికి కృష్ణభక్తి మెండు. దానిని బట్టియే పోతన కవీశ్వరుని యందును అసాధారణభక్తి కలవాడయ్యెను.

ఈ ఖండకావ్యములలో ఒకటి. 'పోతనామాత్యుడు' అనునది ఆ భక్తకవిచక్రవర్తికి ఇతడు సమర్పించిన ఉపహారము. పోతననుండి తాను గ్రహించిన శబ్దభిక్షనే నూత్నరుచి రాహార

PDF Compressor Pro



ముగా పచనముచేసి భాగవతకర్తకు నివేదించుటలో ఇతడు చూపిన పద్యశిల్ప నైపుణి ప్రశంసాపాత్రముగ నున్నది.

నిజమునకు శిల్పమనగానే ఆలోచనాపూర్వక ప్రయత్న సాధితమైన కళాపరిశ్రమ అనెడి యర్థము స్ఫురించును. ఈతని కవిత్వములో అట్టి ప్రయత్నముకూడ కానరాదు. సహజముగ పొంగిపొరలెడి భావములను, ఆ భావములతోనే దొరలుచు వచ్చెడి శబ్దములతో కూర్చుచే యీతని కవితారచనలోని రహస్యముగా పొడకట్టును. పోతనవలె నితడును తన కవిత్వము భగవంతుడే పలికించుచున్నట్లు తలంచుననియు, దానిని బట్టియే సహజ ధారాళతకు ఉపహతి గలిగించు ప్రయత్నమేమియు చేయక నోటవచ్చిన పల్కులనే పద్యముగా ఛందోబద్ధము చేయుననియు నాయూహ. అట్లుగాక పదములను ఏర్చి కూర్చు శిల్ప ప్రయత్నమునకే కడగినచో శైలికి మరింత చిక్కదనము చక్కదనమును వచ్చునేమో కాని యీ సహజ ప్రవాహగతి మాత్రమురాదు. ఈతని శైలిలోని ప్రధాన గుణము ఆ ప్రవాహగమనమే. ఈగుణ మొక్కటియే ఎవని కవిత్వములో నైనను ఇతర గుణలోపము లేవియున్నను కనపడకుండ చేయు శక్తిగలది. ఇట్టి నిసర్గ ధారాళమైన శైలిలో నిష్కళంక హృదయముతో నిర్వ్యాజమైన భక్తితో దేవతలకు పితృదేవతలకు గురుదేవతలకు కావ్యోపహారములు సమర్పించు యీ కవి ధన్యజీవి యయ్యెను.

వాల్తేరు,
10–12–53.

పింగళి లక్ష్మీకాంతం.

# పీఠిక

ఆంధ్ర విశ్వకళాపరిషదాంధ్ర పండితులు

## శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు

శివాయ గురవే నమః

గృహస్థులై నియమబద్ధ జీవితము నెఱపుచు భగవత్ప్రసాదిత మగు కవితాద్రవ్యమును భగవత్కైంకర్యమునకే వినియోగించు సుకవులు చాల నరుదుగా నుందురు. కవిశేఖర గురుజాడ రాఘవశర్మగారు కొంతవఱకు ఆ కోవలోనివారు.

శ్రీ శర్మగారు ఐహిక జీవిత నిర్వహణమునకై లౌకికోద్యోగ మొనర్చుచు, పారమార్థికమును మాత్ర మేమఱక, పవిత్రమైన ఆధ్యాత్మిక జీవితము గడుపుచున్న నవ్యాంధ్రకవులు. కవిగా వీరు ఆంధ్రులకు సుపరిచితులు కూడ. వీరి యిటీవలిపద్యరచనమే యీ కల్పలత.

ఇది కొన్ని ఖండకావ్యముల సంపుటము. ఇందు వినతి, సందర్శనము, వాత్సల్యము, పోతనామాత్యుడు, గోపికాహృదయము, వేడికోలు, శ్రద్ధాంజలి, గ్రహస్తవము, కల్పలత, అను తొమ్మిది శాఖలు గలవు.

కవి రసపూర్ణ హృదయుడు, ఆధ్యాత్మికదృష్టి గలవాఁడును, అంతియ గాక, ఏవిషయము నైనను, భావనాబలముచే నూహించి, అందలి రామణీయకమును మనసార ననుభవించి, ఆ యనుభవమును తన కవితాప్రావీణ్యముచే మన కన్నులయెదుట ప్రాదుర్భవింపఁజేయు శక్తిగలవాఁడు. ఈవిషయము ఇందలి ఏభాగము నైనను నిదానముగా పరికించినచో గోచరించును. ఏదియో యేల! గ్రంథము తెఱచుసరికి యశోద పురిటింటి యుయ్యేలలో: "తమ్ములనేలు కన్నులు సుధాకరబింబము నోము మోము చక్రమ్మును శంఖముం గదయుఁ గైదువు దాఁచిన కేలుదోయితో నమ్మధుసూదనుండు శిశువై" జనియించి కేరింతలాడుచు 'సందర్శన' మొసంగును.

PDF Compressor Pro



ఈ సందర్భనమొక హృదయంగమమైన కల్పనతోఁ గూడిన ఘట్టము. కేశవుఁడు బాలగోపాలుఁడై యశోదయింట జనియించినట్లు విని శివుఁ డాతనిఁ జూడ వేడుకపొడమి సన్న్యాసివేషముతో నాయమయింటి కేఁగి చూపుమని యర్థించును. ఈతఁడు వీధియందు తిరుగాడు సాధారణ భిక్షుకుఁడని యెంచి, దృష్టిదోషము తగులునో, బాలుఁడు కలవరించునో యని భయమంది ఆమె చూప నిరాకరించును. ఆ మాయజంగమును చేయునదిలేక.

"కనులఁ జూతు నంటిఁగాని, యంతకుమించి
యడుగ; నింతలోనె బుడుతఁ డేమి
యరిగిపోవునమ్మ! అయ్యొ! నీకడుపు బం
గారు గా, నిదేమి గోరమమ్మ!

పరిలే! మించినదేమిలే! యిఁక నివాసమ్మున్ వడిన్ జేరెదన్;
మరియాదన్ గనిపట్ట వించుకయు, మా మా తారతమ్యమ్ము; లీ
పరి నీవే బతిమాలుకొంచు వడిగాఁ బర్వెత్తి రాకుందువే!
తరుణీ! నీదయ నాఁటికిన్ మరలిరాదా! పోయివత్తుంగదే!"

అని గొణిగికొంచు శరవేగమున నిజవాసమునకుఁ బోయినాఁడు. 'కాళగళుండు తానిటుల కాలుకదల్చెనో లేదో యింటిలో డోలికనున్న బాలుఁడు గడుంగడునార్చుచుఁ గెవ్వుమంచు, గగ్గో' లొనర్ప నుపక్రమించినాఁడు. దానితో యశోదకు కాలుచేయాడలేదు. మ్రాన్పడి, పసిబిడ్డను కవుఁగిట నెత్తికొనియు పాలిండ్లపై నొత్తికొనియు, ఉసురంచు, శిరము మూర్కొనుచు, "అయ్యో! యింతలో నెంతగా వసివాల్వాడితి! మోము కంది యెటు కెంపైపోయెరా! తండ్రి!" అనుచు దురపిల్లినది. "బాలకున్ మరల డోలాంత స్థితున్ జేసి" యూఁపినది. ఏమిచేసియు నేడ్పుమాన్పలేక విసిగి వేసారి తుదకు 'తాన యేడ్చినది'. ఊరకుండలేక "ఎఱ్ఱనినీరు బాలుపై ముమ్మాఱు దిగఁదీసి దూరముగాఁ బోసినది" అయినను కుఱ్ఱఁ డూరకుండక గుక్కపెట్టి యేడ్వఁ దొడఁగినాఁడు. మరల నెత్తికొని అటునిటు త్రిప్పినది. మొగమందు విభూతినిడినది. ఉస్సురుసు రనుచు సంకటపడి క్రమ్మఱ తొట్టెలోఁ బరుండఁబెట్టి యూఁపినది. ఒడిలో నిడుకొని చనుగుడిపినది. వారివీరి కెఱిఁగించినది. ఇదెక్కడి పాపమో యని విసిగికొన్నది. జోలపాడి

PDF Compressor Pro



నది. ఇట్లు పడరాని పాట్లన్నియుఁ బడినది. ఏమి యొనర్చియు బాలు నోదార్చలేక "శివశివా ! ఏమిసేతు" నని వాపోయినది.

ఈ మాటలు చెవిని బడినంతటనే యంతవరకును గుక్కపెట్టి యేడ్చుచున్న బాలగోపాలుఁ డేడ్పు మాని నవ్వుచు కేకిసలుగొట్టినాఁడు. అంతతో ఆ వచ్చిన యాతఁడు సాధారణ సన్న్యాసి కాఁడనియు, 'ముక్కన్ను త్రిశూలముల డాచి, బాలుని జూడవచ్చిన పరమశివుఁడనియు నాయమకు జ్ఞానోదయమైనది.

ఈ యూహపొడమి నంతనే యశోద తటాలున బాలు నుయ్యెలలో నిడి సవసవ పరువెత్తికొనిపోయి యూరిబైటనున్న మాయజంగము కాళ్ళపైఁబడి

'దేవ, నీవంటి, వీకూనదేవుఁడనుచు
దేవుఁ, డగునేని పోర్వెట్టు నే వచింపు,
మకట ! నీరాకకై యితఁ డడలు నేమొ !
రమ్ము ! నాసామి ! యోదార్చుకొమ్ము వీని.'

అని బతిమాలినది. కడకు సన్న్యాసియు ఆమెమాటలు విని చిఱునవ్వు నవ్వుచు 'తల్లి !' యెట్లు కాదనఁగాఁజెల్లును ! తెమ్మని యామె వెంట నరిగి బాలు నెత్తుకొని శిరమున నిడికొని బుజ్జగించి 'శ్రీరస్తు చిరాయురస్తు'నుచు నాశీర్వదించినాఁడు. యశోదయు మొలకనవ్వుల చిన్నారిపాపను ముద్దాడి సంతసించినది.

ఎంత మనోహరమగు కల్పనయో చూడుడు. కవి శివకేశవుల యద్వైత భావమును మనసార భావించి, పరమశివుని మూర్త్యంతరమగు బాలగోపాలుని ముగ్ధమనోహర రూపమును చూచు వేడుకతో తాన కపటయోగియై యశోద యింటికరిగెనా యనునంతటి తన్మయత్వముతో రచింపఁబడినట్లున్న దీ సందర్భనము. చూడఁజూడ వాత్సల్య ఖండమందలి దేవీ స్తన్యము గ్రోలిన బాలుఁడు గూడ కవియే యేమో !

పోతనయన్నను, భాగవతమన్నను ఈయన కెక్కుడు ప్రీతియని పాడఁ గట్టును. ఈయన రచనయు పోతనశైలినే పోలియుండును. కేవలము పోలికయు గాదు, చాలవఱకు భాగవతమందలి పదములే తమంతతాముగా వచ్చి

PDF Compressor Pro



ఆయా తావులం గుదురుకొన్నవి. అక్కడక్కడ నందలి పద్యపాదములనే యందుకొని సరసముగా రచన సాగించుటయు మెచ్చందగిన విషయము.

ఆటవెలందిని అందముగా నడుపుటలో వేమనది అందెవేసిన చేయి. శ్రీ శర్మగారు ఈ విషయమున ఆతనితో చేతులు కలుపుటకు ముచ్చటపడి చాల వఱకు కృతార్థులైరని చెప్పవచ్చును.

'పాలకడలి తరంగ పన్నుండు బిడ్డ నీ
పొత్తిటను శయించు పున్నెమబ్బ
కన్నులున్నవారు గనంగల్గు భాగ్యమ్ము
కోరి నీకుం గొడుకుం గుఱ్ఱయయ్యె'.

వంటి పద్యములు వీరి రచనలో వజ్రపు తునకలు.

ఇందలి ఖండకావ్యము లన్నియుం జాలవఱకు నీపాకమున నే పడినవి. ఇవి యేకకాలములో నొక్కమారుగా బలిమిమై రచియించినవిగావు. మఱి ఆయాసన్నివేశములు మనసునకు తట్టినపుడు, వాని పలుతెఱంగులకు వ్యవస్థలను పదింబదిగా మననము చేసికొని, కండగల చిక్కని భాషలో వాని కొక సంపూర్ణాకారమును కల్పించి, కవితారూపమున ఆవిష్కరింపం జేసినట్లు తోంచును. వీని బాహిరపు రూపమునుబట్టి ఖండకావ్యము లనుటకంటె, ఆంతర ధర్మము ననుసరించి రసవత్కావ్య ఖండములనుట యెంతయు నుచితము.

భాషలో దోషములు భావములో అనుకరణమును లేక, అడ్డమాంకలు లేని శైలితో, నీ 'బంగారుకొండ తరుగబోదు' 'నీ కడుపు బంగారుగాను' 'పట్టినదెల్ల బంగరగు' 'చిక్కి శల్యమయ్యె' మున్నగు నుడికారములతో రచన యంతయు ప్రసన్నముగా నడచినది. మొత్తముపై నీగ్రంథములో 'ప్రతి యింట' 'చేతును' 'ఊరకొనంగ' వంటి యొండు రెండు అలాక్షణిక ప్రయోగము లున్నను వానిని నీహార లేశములుగా పరిహరించి, యిట్టి చక్కని కావ్యఖండములను రచించిన శ్రీ శర్మగారి నభినందించుచు, వీరిటుపై మధుర మధురములగు కథాకావ్యములను గూడ వెలయించి యితోధికముగా ఆంధ్ర సరస్వతి నారాధింతురుగాక యని ఆశింతును.

దువ్వూరి వేంకటరమణశాస్త్రి.

PDF Compressor Pro

# కృతిసమర్పణము

శ్రీ కృష్ణా! యిదె! కల్ప ల
తా కృతి వర్ధిల్లె నీ కృపామృత వృష్టిన్
జే కొనుము, సమర్పించెద
నీకృతి నీ దివ్య పాద నీరజయుగళిన్.

గతజన్మంబుల నీ యనుగ్రహము,
గల్గన్ లబ్ధమో! యేమొ! నీ
ష్పతివై, శారదవై, సహస్రముఖివై
భాషింప నానందరా
జితమా జీవిత కల్పవల్లి, చిగిరించెన్
బూచె నిండార, శా
శ్వతమా కల్పలతా ప్రసూనములు,
దేవా! నీవ కై కొమ్మవే!

పితృదేవుండవు, మాతవున్ గురుఁడవీవే!
సచ్చిదానంద సం
స్థితిఁ జేకూర భవత్పదాబ్జములఁ దండ్రీ!
చేర్చెదన్ సత్కృపా
మతి నందిచ్చిన, కావ్య కల్పలత,
రెమ్మల్ కొమ్మలున్ బ్రాకి, సం
తత సర్వార్థ సమున్నతంబయి
చిరస్థాయిన్ బ్రకాశింపఁగన్.

PDF Compressor Pro

# ఎ న అ

PDF Compressor Pro

PDF Compressor Pro

# వినతి

అమ్మా! శారద! తొలి జ
న్మమ్మున, నీ పాదరజము, మామక ఘన శీ
ర్షమ్మున దాకఁగ జిహ్వా
గ్రమ్మున నమృతాక్షరములు కదలెఁ గదమ్మా!

నీ కరుణా విశేషమున నిర్మల గాంగ ఝురీ సమానమై
వ్రాకిన సత్కవిత్వము తిరంబుగ పుస్తక రూపముఁ గొనఁ
లోకము నేడొకింత యవలోకనఁ జేసి బహూకరించుటల్
నీ కృపయే కదమ్మ జననీ! మృదు భాషిణి! భక్త పోషిణీ!

"కవిశేఖర" బిరుదము గౌ
రవముగ, నాకొసఁగఁ బూను, ప్రాజ్ఞ జనుల్, సం
స్తవ, నీయు లెంతయును శుభ
మవు, సారస్వత మనీషులౌ వీరి కిలన్.

బిరుదుల కేమి! నీ వొసఁగుభిక్షయె, యక్షయమ్మై, తరింప నా
దరువయి, దివ్య మంగళ పదస్థితిఁ జేర్చిన నాడె, మేటి సం
బర మగుగాని, యిట్టి బహుమానములన్ బరితృప్తి నీ హృదం
తరమునఁ జెంద, భవ్య పదదాసుఁడ, నన్ గృపఁజూడు భారతీ!

తఱుగని నవ్యదివ్య కవితారస వాగ్ఝరిపొంగె నీదు సా
దర కరుణాకటాక్షముల, తల్లి! యెఱుంగుదు, వెంతయర్హ మో
బిరుదులు స్వీకరింపఁగ, కవిప్రకరంబులు గౌరవింప, నం
దఱు తరియించు మేటికవితల్ పలికింపు సదా సరస్వతీ!

PDF Compressor Pro

# సందర్శనము

PDF Compressor Pro

PDF Compressor Pro

# సమర్పణ

తనకున్ గాలముఁజేరువౌ టెఱిఁగి
చెంతన్ రామనామమ్ము సే
య నియోగించి వినంగఁ జెప్పఁ
గదవయ్యా! నాటి సందర్శనం
బని వాత్సల్యమునిండ భక్తి వివశుండై
పిల్చి నన్ బల్కు మ
జ్జనకుండైన త్రియంబకేశ్వరున
కీ 'సందర్శనం' బిచ్చెదన్.

PDF Compressor Pro




'చక్కదనాలచుక్క నొకసారి కనుంగొనవచ్చినాడ'

PDF Compressor Pro

# సందర్శనము

(ఒకనాటి ప్రాతఃకాలమున యశోద బాలకృష్ణునకు పాలిచ్చి యుయ్యెలఁబరుండజేసి బయటికి రాగా బాలకృష్ణ దర్శనార్థము భిక్షుక వేషధారియై చనుదెంచిన శివునిపలుకులు.)

తమ్ములనేలు కన్నులుఁ సుధాకరబింబము నోము మోము చ
క్రమ్మును శంఖమున్ గదయుఁ గైదువు దాఁచిన కేలుదోయి తో
న మ్మధుసూదనుండు శిశువై భువి పుణ్యముపంట నీదు గ
ర్భమ్మునఁ బండెనంట! తొలిబాముల నోఁచిన నోము లెట్టివో!

అదితికిఁ గోసలాత్మజకు నబ్బిన భాగ్యము నీకు నబ్బెనో
సుదతిరొ! నీకతమ్మునను సూ! వ్రజ మిప్డు వికుంఠ మయ్యెః నీ
పదయుగ మంటువారి కఘపంకము లంటవు; నిన్నుగాంచుటన్
సుదినము నేడు; నీసుతునిఁ జూచుట పుట్టువు కాలఁదన్నుటల్.

విశ్వ మంతట నెక్కటి వెలుఁగు వెలుఁగు
మునిమనో గహ్వరములఁ గ్రమ్మిన వెలుంగు
నేఁడు నీయింటి దివ్వెయై నీకుఁ గనుల
పండువయ్యెను నీవెంత భాగ్యవతివొ !

PDF Compressor Pro

పాలకడలి తరఁగ బన్నుండు బిడ్డ నీ
పొత్తిటను శయించు పున్నె మబ్బె
కన్ను లున్న వారు గనఁ గల్గు భాగ్యమ్ము
కోరి నీకుఁ గొడుకుఁ గుఱ్ఱ యయ్యె.

ఆతఁ డరకంటఁ గనుగొన్న నంతులేని
బహు తమోమయ మైన ప్రపంచమాయ
తొలఁగు జనులకు; వెలుఁగు వెన్నెలలు లోన;
ఆ పరబ్రహ్మ నీయింటి దీపము కద !

నివ్వెర పాటు దోఁప గమనించెద వేటికి? నన్ను నేవియో
త్రవ్వుచు లేనిగాథలు సదా తిరిపెమ్మునకై చరించు వీఁ
డెవ్వఁ? డిటుల్ వచించునని యెంచకు కొంచకు నన్ను గాంచి మా
యవ్వరో! నీకతమ్మునఁ గృతార్థము లౌ జుమి నేఁడు నాకనుల్.

తిరిపెమునకేమి ! పది యిండ్లు తిరిగి తెత్తు
నీలమణి వోలె నీయింట డోల నూగు
బాలకునిఁ జూచుటయె నాదు పాలి కమృత
భిక్ష మొసఁగుము కన్నుల విందునేఁడు.

పరిపూర్ణంబగు తేజమే యదియు నీభాగ్యమ్మె కావచ్చు నే
పరికింపన్ దరిఁజేరినన్ జనని ! నీ బంగారుకొండన్ గనన్
దరుగంజాలఁ, డొకింతయున్ బెరుగు, తద్ధ్య మ్మిద్ది నామాట యే
క్కరణిన్ వీడఁగలాఁడఁ గాంచకె జగత్కల్యాణ సంపత్ప్రదున్.

పట్టినదెల్ల బంగరగుఁ బల్కిన దెల్ల ఫలించుఁ; బిట్టపో
ర్వెట్టెడి వారికిన్ నుదుటఁ బెట్టిన నాఁడు విభూతి హాయి గ
న్పట్టును; చిక్కి శల్యమగు వారల నేనొక యింత ముట్టుతే
గట్టి దురాయి యౌనను జగ, మ్మిదిగాదు బడాయి నమ్ముమా !

చక్కని వారిలో మిగుల చక్కని వాఁ డిటువంటి వాని మే
మెక్కడఁ జూడ మంచు వచియించెద రెల్లెడ నమ్మలక్క లా
చక్కదనాల చుక్క నొకసారి కనుంగొన వచ్చినాడ నో
యక్కరొ ! కాదు కూడ దన కాదృతి వీని ననుగ్రహింపుమా.

పకపక నవ్వుచుండె నదెబాలుఁడు బ్రహ్మమయుండు, వాని దా
చి కొనిన దాగునే ! అదిగొ ! చిర్నగ వెల్లెడ వెల్లి పొర్లు, నే
రికి దెలియంగ నౌనె ! జడురీతి, పిశాచము భాతి, బాలు పో
లికఁ జరియించు వారిఁ గనలేరు మహాత్ముల నెంత వారలున్.

PDF Compressor Pro

అని బహువిధములఁ బ్రార్థిం
చిన యాతని మాట కెదురు చెప్పుటకున్ బా
లుని జూపించుటకున్ దన
మనసాడక యంత పల్కె మానిని యిట్టుల్.

అబ్బీ! నీమెఱమెచ్చు మాట లివి యేలా? వానిచే నుబ్బి త
బ్బిబ్బా గోలను గాను నాదు పలుకుల్ విన్పించు కో వొక్క ట
బ్బబ్బా! మ్రోతయి పోయె పాల్గుడిచి శయ్యం బిడ్డ కన్మూసె నీ
పబ్బం బించుక తీర నీవరిగె దాపై పాప పోర్వెట్టఁడే!

కోరికల కేమి! గొంతెమ్మ కోరికలను
దీర్ప వచ్చునె! ఎవ్వారి దృష్టి యెట్టి
దో యెఱుఁగ రాదు నీత్రోవఁ బోయెదో! బి
కారి! యెద్దు పుండరయని కాకివీవు.

వచ్చిన దారిం బొమ్మా!
చెచ్చెఱ నీవింక నాసచే నిల్వ కనన్
హెచ్చిన భక్తిన్ మఱి వా
క్రుచ్చు నతం డిట్లు తల్లిరో! విను మంచున్.

PDF Compressor Pro

కోరఁగ లేదు పుట్టములు గోరఁగ లేదు ధనమ్ము భిక్షమున్
గోరఁగ లేదు నీవలనఁ గోరిన దొక్కటి యే కదా జగ
ద్ధారకు, ఁగ్రూర రాక్షస విదారకుఁ దాప నివారకున్ భవ
ద్ధారకుఁ జూడ నిమ్ము భవతారకు వేఁడెద నిన్ను సారెకున్.

అల్లదె ! ఘల్లు ఘల్లు మను నందెల సందడి యాలకింపఁ గా
నుల్లము ఝల్లనున్ జననిరో ! కనని మ్మొకసారి కన్నులన్
బల్లవ కోమలమ్ము నతపాప హరమ్మగు తత్పద ద్వయిన్
జల్లగ నద్దికొందు మనసా మనసాయె వర మ్మిదే కదా.

కారణ కారణుండు త్రిజగమ్ము సృజింప నడంపఁ బెంప నా
ధారుఁడు సర్వ కిల్బిష విదారుఁడు యోగి హృదంతరాళ సం
చారుఁడు, సద్దయాపరుఁడు శాశ్వత ముక్తి విధాత, మోహనా
కారుఁడు బాలుఁ డయ్యె నఁట కంటివె? యా యవతార మెట్టిదో.

ఎన్నో నోముల నోచినన్ గలుగునే యీ దొడ్డ భాగ్యమ్ము నీ
కన్నన్ బున్నెము సేయరే సుదతులున్ ! కన్యయ్య ఁగన్నావుగా
సాన్నిధ్యంబున కై మహామహులు కాంక్షల్ సేతురే డాయఁగా
నెన్నండున్ జగమేలు తండ్రి కిల నీవే తల్లి వం చెంచితే !

PDF Compressor Pro

అమ్మ! యీవరమిమ్ము, పాదమ్ము లంటి
వేడు కొందు (గదే! ముద్దు లొడువాని
మోము చక్కందనము ముని మోహనమ్ము
నొక్కపరి యొక్కపరి గాంచి చక్క(బోదు.

సిరి కల్గువా(డు నా చెలికాడె కాని నే
తిరిపె మెత్త(గ వేజె దిక్కు లేదు
భూరిశైలాటవీ ఘోర సీమలె కాని
యిమ్ముగా నిల్వ గృహమ్ము లేదు
భస్మాంగకము నందు, వల్క లమ్ములె కాని
రత్నాంబరాది ధారణము లేదు
స్థావర జంగ మాత్మక భూత తతి కాని,
కాంచనే బంధు వర్గంబు లేదు

పాపలను( జూడ కన్నుల పండు వగును
నన్ను (జూచిన పాపలు మిన్న కుందు
రంతి యేకాని నన్నొక భ్రాంతి చేత
గాసి వెట్టుట యెంతయో దోస మమ్మ.

PDF Compressor Pro

ఎంత వేడుకొన్న నింతయు కరఁగ వీ
కటికదనము నీకుఁ గలిగె నెట్లు
ఘన కృపాసముద్రుఁ గడుపారఁ గన్న మా
యమ్మ! త్రోసి పుచ్చ కమ్మ నన్ను.

కనులఁ జూతు నంటిఁ గాని, అంతకు మించి
యడుగ, నింతలోనె బుడుతఁ డేమి
యరిగి పోవునమ్మ! అయ్యో! నీకడుపు బం
గారు గా, నిదేమి గోర మమ్మ.

సరిలే! మించిన దేమిలే? యిఁక, నివాసమ్మున్ వడిన్ జేరెదన్
మరియాదన్ గనిపట్ట వించుకయు మా మా తారతమ్యమ్ము లీ
పరి నీవే బతిమాలు కొంచు వడిగాఁ బర్వెత్తి రాకుందువే!
తరుణీ! నీదయ నాఁటికిన్ మఱలిరాదా పోయి వత్తుం గదే!

అని శర వేగమ్మున దా
జనియెన్ నిజవాసమునకు శంకరుఁ డంతన్
మననము సేయుచు శ్రీహరి
జనని యశోదమ్మ లోభ సంగతి దనలోన్.

కాలగళుందు దానిటులఁ గాలు గదల్చెనో లేదో, యింటిలో
డోలిక నున్న బాలుఁడు గడుంగడు నార్చుచుఁ గెవ్వు మంచు గ
గ్గో లొనరించె నంతఁ దనకుం గత మారయ రాక దేవికిన్
జాలక కాలు కేల్ గదపఁ జాలక మ్రాన్పడె నయ్యశోదయున్.

పసిబిడ్డన్ కవుగింటి కెత్తికొనియెన్ బాలిండ్లపై నొత్తికొం
చుసురంచున్, శిరమందు మూర్కొనుచు నయ్యో యింతలో నెంతగా
వసి వాశ్వాడితి మోము గంది యెటు కెంపై పోయెరా! తండ్రి! నీ
ముసిన వ్వేదిర! వేగి యెవ్వరి మొగమ్మున్ నేఁడు గన్గొంటిరా!

అనుచున్ దూపిలు, బాలకున్ మఱల డోలాంత స్థితుంజేసి యూ
పును దాఁ గ్రమ్మఱఁ జేత నందికొను నూపున్ వెండియున్ దొట్టె, నే
డ్పునుమాన్పంగ నుపాయముంగనక యేడ్పుందాన ముమ్మాఱు లె
ఱ్ఱని నీరుం దిగదీసి బాలుపయిఁ బాఱం బోయు దూరమ్మునన్.

అటు నిటు ద్రిప్పుబాలు, మొగమందు విభూతి నిడున్, దనంత, సం
కట పడు, నుస్సు రుస్సు రను గ్రమ్మఱ దొట్టెఁ బరుండఁ బెట్టు నం
తటఁ జనుగుడ్పు, దాఁ గుడిపి నన్నిసు వేడ్పుటుడుంగమిన్ గవుం
గిట నిడి, వారి వీరి కెరిగించు నిదెక్కడి పాపమోయనున్.

అలక లమర్చి కజ్జలము నందముగా గనుదోయిఁదీర్చి మేల్
తిలకము దిద్ది నెన్నుదుట దీరుగ చక్కని చుక్కవెట్టి చె
క్కిలి పయి నవ్వజేసి గిలిగింతల హాయిగ జోలపాడి యు
య్యేల శయనింప జేసితి గదే యెటు మేల్కని పోరు వెట్టెడిన్.

భూతవిభుండు నా నెవఁడొ, బూడిద పూసిన మేనితో జటా
స్ఫీత శిరమ్ము తోడ, నిరుచేతుల దండము నక్షమాలయున్
బ్రాతిగఁ దాల్చివచ్చెఁ బసిపాపను జూతునటంచుఁ జూపకే
పోతిని, ఉన్నరూ పెఱుఁగఁ బోలని వానికి వేసగానికిన్.

ఎక్కడి పోరు ! కాల్ గదల నీయఁడు, ము న్నెఱుగంగ మిట్టి పో
ర్పొక్కు గృహమ్మునన్, గదలి పో మన సాడదు చూడఁ జూడఁ బ్రొ
ద్దెక్కెడు నింటిలోని పను లెచ్చటి వచ్చట నుండె నింక నే
నెక్కడఁ జొత్తు ! వేఁడుదు మరెవ్వరి ! కోరుదునింక నెవ్వరిన్ !

ఎక్కడి దృష్టి దోషమిది ! యేది యొనర్చిన దీర దయ్యె యే
వాక్కు ఫలమ్మొ ! యే పొరుగు వారలు రా రిలుఁ జేర, కల్గి లే
కొక్కఁడు గాని లేడని, అయో ! కనిపెట్టగఁ వేయి కన్నులన్
దిక్కెవ రింక నాకు, గృహ దేవతలార ! యనుగ్రహింపుడీ !

PDF Compressor Pro

ఆ జడదారి పల్కులవి యారయ సంశయ మందు డెంద మీ
యోజ నిజమ్మగున్ వినెడి యోరిమి లేకయె, తూలనాడి, నా
నైజము వెళ్లబెట్టితి గనం గన సిద్ధుఁడో! సుప్రసిద్ధుఁడో
తేజము డించి చూడఁ జనుదెంచు శివుండో! యెఱుంగ నైతిగా.

సిగముడి గంగలేదు మఱి చేతఁ ద్రిశూలము లేదు, మేనిలో
సగమగు నాతిలేద, అరచందురుఁడున్ శిరమందు లేఁడు, ప
న్నగముల హారముల్ గళమునన్ గనుపింపవు గాని, తేజమె
న్నగ శివుఁడేమొ నా మనమునన్ దిగులయ్యెడు నేమి సేయుదున్.

సరిలే మించిన దేమిలే! యిపుడె నా సాన్నిధ్యమున్ జేరఁగా
తరుణం బెంతయొ దవ్వు కాదనుచు, నాతం డేగె, చూడంగ నె
వ్వరు కారింతకు నాతఁ డేకతము నే ప్రార్థింపఁగాఁ బోదు, స
త్వరమే, దిక్కెవరింక నో, శివ శివా! పాలింప మ మ్మియ్యెడన్.

'శివ! శివ! యేమి సేతు' నని చింతిల నంతనె పోరు మానుఁ దా
చెవి, పెఱ మాట సోకఁగనె, చిన్న యొనర్చి మొగమ్ము గ్రమ్మరన్
కెవు కెవు మంచు నేడ్చు, శివకీర్తన రమ్యమొ! లేక యాతఁడున్
శివుఁడగు నేమొ! పల్కితి నిసీ! కఠినోక్తుల మే ల్దలంపకే.

PDF Compressor Pro

నా యిలువేల్పు లార! తగునా! యిటు లూర కొసంగ మీకు లే
దాయెను నాపయిన్ గరుణ తప్పులు గల్గిన సైపరయ్య! మీ
దే! యిఁక భారమయ్య! సరి తీర్పఁగ మ్రొక్కులు, మీదు గట్టెదన్
నా యుసు రేనొసంగెదను నా పసిపాపకు రక్షవెట్టరే.

జోగి తనాన నా మనసు శోధన సేయఁగ వచ్చినట్టి నిన్
యోగి విభుండుగా నెఱుఁగ నోపక యెగ్గులు వల్కితిన్ దయా
సాగర! నాతనూజుఁ గృపసాకవె! మౌనులకేని దుర్లభం
బౌగద నీదు మాయ దెలియం గలనే! కడు బేలనో శివా!.

దేవ! నీవంటి 'వీకూన దేవుఁ' డనుచు
దేవుఁ డగునేని పోర్వెట్టునే వచింపు?
మకట! నీరాకకే యీతఁ డడలు నేమొ!
రమ్ము నాసామి! యోదార్చు కొమ్ము! వీని.

విని తత్ప్రార్థన, తోడనే, శివుఁడు తా విచ్చేసి, వీక్షించి నం
తనె పోరెంతయు మాని, నేత్రయుగమున్ దా విప్పి బాలుండు న
వ్వీన నానందమునన్ శివుండు, మఱచెన్ విశ్వమ్ము నీదృశ్యమున్
గనుచున్ దల్లి యశోద, జార్చె గనులన్ బాష్పంబు పూరమ్ములన్.

PDF Compressor Pro

"పనివినియెద" నను, శివునిన్
గని, పల్కె యశోద, నాయనా! నీ దాఱిం
జనియెదు, నా బిడ్డం డే
డ్చిన, మఱి సాధనముఁ జెప్పుడీ! యన నతఁడున్.

మానిని! చింతనొంద కనుమానము, మానుము, నీదు పాపఁడీ
పై నిటు, పోరు పెట్టఁడు, భవ ద్గృహసీమఁ దలంప వ్రాలెదన్
నే నిఁక బోయివత్తుఁ గరుణింపు మనంగ మహానుభావ! దే
వా! నిముసమ్ము నోర్వగల వారమె! నీయెడబాటు మాదృశుల్.

సనక సనందనాది మునిసన్నుతుఁ డీతఁడు నాదయన్ మహా
త్మునిఁ బసికూనఁ జూచు నెపమున్ గొనివచ్చుట లేక లేక, క
ల్గిన, పసిపాపకై, మహిత లీలలు విస్మయ మొందఁ జూపి, తాఁ
జనియెద నన్న, వల్లె యనఁ జాలు నమాయికురాలు కల్గునే!

నీవంటి వార లిండ్లకుఁ
దా వచ్చుట పుణ్యమిది, యథార్థమెకా! నీ
తావునకున్ బోయెద ననఁ
బోవలవ దటంచుఁ జెప్పఁ బోలదుగాదే!

PDF Compressor Pro

క్షణవిశ్రాంతి, మహాత్మ ! మాదృశు లెఱుంగన్ లేరు సంసార జీ
వను లౌటన్, మిము బోంట్ల నేమనుదు మబ్బా ! విశ్వ సంసార పో
షణ దీక్ష పరతంత్ర శీలురకు, విశ్రాంతిస్థితిన్ జెప్ప, మే
మనుదున్, మీరలు పోయివత్తు మన ధైర్యం బింత లేదాయెఁగా.

ప్రాణము లీయవచ్చిన, కృపా పరిపూర్ణుఁడ వీవు తండ్రి ! స్వ
స్థానముఁ జేరు వెల్ల సహజమ్ము భువిన్ బ్రతిజీవి, కెన్ని నా
ళ్లైనను నిన్ను వీడ, మనసాడదు గా యిది దైవ నిర్ణయం
బేని, భరింపఁ దీఱదు సహింప, సహింపక యున్న, మానునే !

ఐన మఱొక్క యూహ, హృదయమ్ముఁ గలంచెడిఁ బోరు వెట్టు నే
రేని, భవత్కరమ్ము స్పృశియింప, విభూతి నిడన్ దురాయియై
మానుదు రంచు నీవనిన, మాట లబద్ధము కావు; నేడు దూ
రానకుఁ బోయి, వత్తు ననరాదు, దురాయి ననుగ్రహింపుమా !

అని వేడుకొను యశోదన్
గని శివుఁ డనుఁ దల్లి ! యెట్లు కాదనఁ గాఁ జె
ల్లును తెమ్మా ! యిటఁ గూర్చుం
దును, పసికందునకుఁ గట్టుదు నిదె, దురాయిన్.

PDF Compressor Pro

శైశవ లీల సుమ్మిది విచారము మాను, దురాయిగా, జటా
కేశముఁ గట్టి, నెత్తు మిరుకేల మదీయ శిరంబుపై నిదే
నీ శిశుపాద మాన జననీ ! భయలేశము లేదు, తీఱె నా
యాశయ, మీవు నీశిశువు హాయిగ నుండుడు పోయివచ్చెదన్.

అని, కాళ్ళం జిఱుగజ్జె లందియలతో నల్లారు ముద్దారు బా
లున కుం గట్టె దురాయిఁ దాశివుఁడు కేల్దోయిన్ జటాకేశమున్
గాని, "శ్రీరస్తు చిరాయు ర" స్తనుచు సంతోషమ్ము నిండార, పా
పని ముద్దాడె యశోద, వీడె శివుఁ డావాసమ్ముఁ జేరన్ వెసన్.

PDF Compressor Pro

# వాత్సల్యము

PDF Compressor Pro



# సమర్పణ

తన ప్రాణమ్మున కంటెఁ బ్రాణమని కాదా !
రామ నామమ్ము కం
టెను, నీరాఘవు ముద్దు పల్కులవి
యెంతేఁ బ్రీతి పాత్రములం
చును, విన్పింపఁ గఁ గోఱె, నంత్య
దశలో శుద్ధాంత రంగుండు, మ
జ్జనకున్ గొల్తుఁ బ్రియంబ కేశ్వరుని
'వాత్సల్య' ప్రదానమ్మునన్.

"తవ స్తన్యం మన్యే ధరణిధరకన్యే హృదయతః
పయః పారావారం పరివహతి సారస్వత మివ
దయావత్యా దత్తం ద్రవిడశిశు రాస్వాద్య తవ య
త్కవీనాం ప్రౌఢానా మజని కమనీయః కవయితా."

# వాత్సల్యము

(ఒకనాటి ప్రాతఃకాలమున బాలుని తల్లిదండ్రులు, తమ యింటి పనుల సందడిలో మునిగి, యిలువేల్పైన, దేవికి, పాలు నివేదనఁ జేసి యారగింపుమని బాలుని కాజ్ఞ యిడ బాలుఁడు, శ్రీ దేవీ విగ్రహ సన్నిధికి పాలగిన్నెతో నేతెంచి—)

అమ్మా! తల్లియుఁ దండ్రియున్ స్వగృహ కార్యవ్యగ్రులై యుండి క్షీ
రమ్ముల్ బంపిరి నీకిడన్ రజతపాత్రన్ దెచ్చినానమ్మ రా
వమ్మా! త్రాగఁగ నీ కృపాలవము నాపైఁ జిల్కు మేనాటి పు
న్నెమ్మో! చేర్చినదమ్మ నీదు పదసాన్నిధ్యమ్ము ధన్యాత్ముఁడన్. 1

చల్లని తల్లి వంచు నెదఁజాలిగలట్టి మహాత్మురాల వం
చెల్లెడఁ జెప్పుకొందురు గదే! యదె నిక్కువమైన నా పయిన్
జల్లని నీ కృపామృతము చల్లగ నీవిక లేచిరమ్మ! ఉ
త్ఫుల్లసరోజనేత్ర! పరిపూర్ణ దయాసుమ దేహవల్లికా! 2

నిచ్చలు నిన్ స్మరింతు నెద నీదయ నాపయి నెన్నడేనిఁ దా
వచ్చునె యంచుఁ గాచికొన వచ్చెనుగా తరుణమ్ము నేఁడు, నే
వచ్చితి కల్పవల్లి యను వాంఛ భవత్పద యుగ్మ సేవకున్
దెచ్చితినమ్మ నీకొఱకిదే! నులివెచ్చని పాలు ప్రీతిమై. 3

4 మిక్కిలి చిక్కనై, మిసిమి మీగడ గట్టిన యావుపాలివే
చక్కెర జేర్చి తెచ్చితిని సాపడ రాగదవమ్మ, నిన్నిదే
మ్రొక్కెదఁ జేతులెత్తి దయ పొంపిరివోఁ గనుమాయునంతలో
గ్రక్కునఁ ద్రావఁగావలె, తిరమ్మగు నీదయ కాన రావలెన్.

5 మక్కువమీర నిన్ను బతిమాలుకొలందిని నాకుఁ గూడఁ బ్రొ
ద్దెక్కఁదొడంగె నాకటికి నెమ్మొయి వేళ యతిక్రమించెడిన్.
సొక్కెడు మేను, నెమ్మనము సోల దొడంగెను నాకు నీకు మా
యక్కరొ! ఆరగింపగదవమ్మ తటాలున, నేల మారమున్?

6 ఏరయినన్ గృహాన ధరియించెడి చీరలుగాని, వెండి బం
గారపు వస్తుజాలములుగాని, ఫలమ్ములుగాని, మంచి సిం
గారము జిల్కు పుష్పములుగాని, రసాన్నముగాని, నీకు నా
చారముగాగ ముందిడి, ప్రసాదము మేము గ్రహింతు మాపయిన్.

7 నను గనుమీ! యనుగ్రహమునన్, జని గ్రక్కున పాలు ద్రావుమీ!
జనని యొసంగినన్ గరము జాచి గ్రహించెడు దానవంట, మ
జ్జనకు డొసంగినన్ గొనెదు! జాలము నేడిటు లేల జేసె, దీ
తనిపయి కోపమేమిటికి, త్రావఁగరావె! యనుగ్రహింపవే!



PDF Compressor Pro

PDF Compressor Pro

నే పసివాడ నేరిచియొ నేరకయో దొసఁగున్ బొనర్చినన్
సైపగ లేవటమ్మ! దయ చాలగ గల్గిన తల్లి వండ్రు, నీ
పాపడ గాని, నేను పెఱవాడను గాదు గదమ్మ! నమ్మవే!
నీపయి నొట్టుపెట్టెదను, నేనిది యెంగిలిసేయ నింతయున్. 8

జననీ! చేరితి నేలుకొందు వను నాసన్, మత్కరస్పర్శచే
తనె యీ పాల కొకింత యేమి కలుషత్వం బంటెనో! యేమొ! చా
లును, నీ మౌనమె నా యనర్హతను దెల్పున్, దెల్పకే యేమి నే
తు నికన్, నేరక యంటికొంటి నిను బస్తున్ బెట్టితిన్ నేటికిన్. 9

ఇఁక నిన్నెంతగ వేడుకొన్న దయరాదే! ఇంక నే నెట్టు లిం
టికి బోనా నెటు విన్నవించుకొననా నీ పాపభారమ్ము మ
చ్చికమై నీవె యనుగ్రహింపఁదగు శిక్షింపందగున్ లేదు ది
క్కిక నాకున్ శరణమ్ము త్వత్పదయుగమ్మే ముంచినన్ దేల్చినన్. 10

అని దేవీపదపంకజాతయుగమున్ హస్తమ్ములన్ బట్టి, క
న్గొనలన్ బాష్పకణమ్ము లుప్పతిల నాక్రోశించు "తల్లీ! దయన్
గని రావా!" యని శీర్ష మాపె పదయుగ్మంబాన్చి తాడించు, దొ
ర్లు నిట్టట్టుల్ ధరఁ దీర్చిదిద్దిన కురుల్ దూగాడఁ జీకాకుగా. 11

12 బహువిధముల దేవీ వి
గ్రహ పదపీఠమున కెఱిగి ప్రార్థించు నను
గ్రహమునకై బాలుఁడు మది
తహతహపడు నాపె దివ్య దర్శనమునకై.

13 వరభద్రాభయ మాతృపాదముల నాప్లావించె దోడ్తో నిరం
తర చింతాయుత బాష్పవారి, నత డున్మత్తుండునై మేని యం
బర మిట్టట్టుల జార్చుచున్ దుడిచె బాష్పస్నాత పాదాబ్జముల్
శిరముంబాసి తొలంగు పూవుల సమర్పించెన్ శుగావిష్టుఁడై.

14 చిఱునవ్వుల్ దళుకొత్తు చంద్రకళయో ! చెల్వారు సౌందర్యమో !
కరపాదద్యుతి పుష్పితాంబుజ లస త్కాసారమో ! కాక తొ
ల్కారి మబ్బున్ గడద్రోయు నట్టి మెఱుపో! లావణ్య పుంజంబొ! స
త్కారుణా శ్రీకర మూలకందమన సాక్షాత్కారయై దేవియున్.

15 కరమాశ్చర్యము గొల్ప, పెల్లుబికి సాగన్ గొంతు లావిగ్రహాం
తర భాగమ్మునువీడి తా నభయహ స్తమ్మున్ వడిన్ జాచుచున్
జిరున వ్వాననసీమ గుల్క ననె "నా చిన్నారి ! పొన్నారి ! స
త్వరమే పాలిడరార ! కోపమిఁక నాపై నేలరా ! నాయనా !

PDF Compressor Pro

బాలక ! పాలివిగో ! యని
చాల స్మరించితివి గానఁ జనుదెంచితి పా
లేలా ! యీయవు జాగిది
యేలా ! తేతెమ్ము ! పలుకవేలా ! యనుచున్. 16

వడి బాలున్ గరపల్లవమ్ములను లేవం దీసి యోదార్చు; నా
తఁడు మాటాడఁగ లేక విస్మయమునన్ దా నిల్వ వాత్సల్య మే
ర్పడఁ బాలన్నియుఁ ద్రావి రిక్తమగు పాత్రన్ జేతి కందీయ ప్రా
న్పడి బాలుండు సగమ్ముపాలకొఱకై ప్రార్థించు దీనాస్యుడై. 17

అమ్మా ! సర్వ మెఱుంగుదానవు గదమ్మా ! పాత్రలో గల్గు క్షీ
రమ్మెల్లన్ వెస ద్రాగి, రిక్తమగు పాత్రన్ నాకు నందీయ న్యా
యమ్మే ! నాసగపాలు ద్రాగితివె ! యమ్మా ! యేక్రియన్ నాదు జీ
వమ్మున్ నిల్పుదు ! బాలుపాలు, హరియింపం జాలి తిం కేమనన్. 18

నేరము లెన్న నేర, ప్రతినిత్యము, నాకిడు పాలలో సగం
బారసి, నీవు చేకొనుచు, నందలి యర్థ మొసంగుచుందు, వే
తీరున, క్షుత్పిపాస లవితీరు, వచింపు, మకాలమందు, నె
వ్వారలు ప్రేమచే, మరల పాలొసఁగం గలవా రనంగఁ దాన్. 19

20 ఏలా ! నిష్ఠురవాక్యముల్ పలికె దోయీ ! నేను బెల్లాకటన్
బాలెల్లన్, వెస్రద్రావివై చితి స్మరింపన్‌లేక నీక్షుత్తు, నా
పాలం గల్గిన, యీదొసంగు, సయిరింపన్ లేవటోయీ ! దయా
శాలీ ! నేనిఁక నెన్నడున్ సలుప దోషంబిట్టు లన్నా ! యనన్

21 నీపొరపాటు కాదు జననీ ! దురదృష్టము నాదె, యీ మన
స్తాపము నేరికిం దెలుపఁజాలుదు, నెవ్వరికైన ప్రాణముల్
తీపియ నీదుపాల బడితిన్ నను బ్రోచిన బ్రోవకుండినన్
నీపద యుగ్మముల్ విడువనేరను నీదయ ! యెట్లు చేసెదో !

22 హృదయంబందలి తాప మెంతనుదు తల్లీ ! యారు నూరైన నీ
పదయుగ్మం బిదె పట్టుకొంటి నిక నాపాలిచ్చే యీ స్థానమున్
గదలంగానగు పిచ్చిపాపఁ డని యేగా నన్నిటుల్ మాయఁ జే
సెదు, నీ తీయనిమాటలున్ దెలిసె, నీ చేతల్ వృథా సుమ్మికన్.

23 అని దేవీపద పద్మము
లను గట్టిగబట్టి కన్నులను బాష్పమ్ముల్
దొన దొన గార్చెడి బాలుని
గని యేమిన్ జేయఁ జేతకాక చకితయ్యె.

PDF Compressor Pro

షును ముమ్మూర్తులఁ జంటిపాపలుగ నేపూబోడి, గావించె, నా
యనసూయాసతి పోల్కిఁ, కృష్ణునకు నెయ్యంబాఱ బాలిచ్చి పెం
చిన పుణ్యాంగనయౌ యశోద వలె, దాక్షిణ్యంబునన్ దేవి, పా
పని నిండార గవుంగిటం బొదివి, చేపన్ జొచ్చె స్తన్యమ్ములన్. 24

స్తనయుగ్మంబున, ధారఁ గట్టెడి, పయస్రావమ్ము నిండించి పా
త్ర నొసంగన్ గ్రహియించి, బాలుఁడు వెసన్, ద్రావంగ, నల్లంతఁ దీ
యని సారస్వతమున్ స్రవించెను, బ్రవాహంబై ముఖాబ్జంబు నం
దున దేవీ కరుణాకటాక్ష మది, చిందుల్ ద్రొక్కుచున్ బొంగఁగా. 25

మాతా! మంజుల వాగ్విలాస కవితా మాధుర్య దానప్రభా
వాతీతా ! సకలార్తి సంహరణ విద్యాన్వీత ! సచ్చిచ్ఛుభో
పేతా ! సర్వ జగచ్ఛివంకర దయావిఖ్యాత ! త్రైవిష్టప
ఖ్యాతాఽమేయ మహత్త్వ సంకలిత ! మాయాతీత ! సత్యస్థితా ! 26

ధన్యంబై నది ధన్యమైనది యహో ! ధన్యమ్ము నాజీవితం
బన్యాలోచనలేల ! పూర్వకృత పుణ్యం బట్లు పండెన్ భవత్
స్తన్యమ్మున్ వెస ద్రావినంత; జననీ ! సారస్వ తాస్థాన మూ
ర్ధన్యున్ జేసితి నీదు క్షీరమె కవిత్వంబౌటఁ బల్కించితౌ ! 27

PDF Compressor Pro

28 అమ్మా! నీమహిమ మ్మెఱుంగనగునే! యామ్నాయముల్ సర్వశా
స్త్రమ్ముల్ నీవ కదమ్మ! నీకరుణ లేశంబైన యార్జించు పు
ణ్యమ్మున్నన్ వచియించు టబ్రమొకో కావ్యమ్ముల్! భవత్పాదప
ద్మమ్ముల్ నమ్మితి; భక్తకల్పక లతాంతశ్రీ! దయన్ బ్రోవుమా!

29 మా స్వకపోల కల్పనల మాట విచిత్రము చెప్ప శబ్ద స
ర్వస్వము నీవ, నీకరుణఁ బ్రాకు ననంత కవిత్వవల్లి, ది
వ్యస్వర మిచ్చుటన్ గరతలామలకంబుగఁ దోచె నాకు సా
రస్వత మెల్ల, ముజ్జగములన్ సృజియించిన నీకు వింతయే ?

30 నిక్కము జెప్పవాడ జననీ! హృదయాంతర మందు నేవియో
యెక్కడలేని కోర్కెలుదయించి, యడంగెడు, వానికేమి! యం
దొక్క తలంపు, గాల్నిలిపి యూరక నన్ బడలింపఁ జొచ్చెడిన్
చక్కికిఁ జేరనా! చనువొసంగిన యప్పుడె, చేరి వేడనా.

31 ఇలఁ జిరకాల వాసన ఫలింపఁగ, నెల్లెడ నల్లుకొన్న, యీ
బలితపు పాదునందు, బరిపాటి ననల్ కొనలేచి, నల్గడల్
దళముగ తీవదొంతరలు, దారులు మూయుచు, గట్టెడున్ బొదల్
కలుగునె! మూలముట్టుగఁ బొకాలెడు కాలము నానతీగదే!

PDF Compressor Pro

ఎన్నఁడు నీపదమ్ములు గ్రహింతు, ప్రసన్న భవత్కటాక్ష సం
పన్నత లబ్బు నెన్నటికి! వాగమృతమ్మునుఁ జిల్కఁ బల్కె దీ
వెన్నటి కింక, నాకనుల నెమ్మొయిఁ జూచిన చూపు చాలదే!
చెన్నటిదేహ మేమిటి, కిసీ! యనిపించెడి నమ్మ, నమ్ముమా! 32

వ్యాప్తంబైన చరాచర ప్రతతి కీ వాధారమమ్మా! త్రయీ
గుప్తంబైన భవత్ ప్రభావమును వాక్కుల్ పల్క లేవంట సం
ప్రాప్తంబైన పదార్థముల్ గొనుచు నారాధించు కొంచుందు, సం
తృప్తిన్ నీపిలు పెప్డు వచ్చు నపుడే యేతెంతు నిశ్చింతమై. 33

అమ్మ! జయమ్ము నీకగుత మాశ్రిత సద్గురు దేవతా కటా
క్షమ్మొ! మదీయ పూర్వభవ సంచిత పుణ్య విశేషమేమొ! లోఁ
గ్రమ్మిన దుస్తమమ్ము విడఁగాఁ దెఱదీసిన యట్లు నాకు జ్ఞా
న మ్ముదయించె నీ దరిసెనమ్మున నేలుమ! సర్వమంగళా! 34

అని సాష్టాంగ నమస్కృతుల్ సలుపుచున్ బ్రార్థించు బాలున్ గర
మ్మున గీలించి కవుంగిటం బొదువుచున్ ముద్దాడె నాదేవి; తా
చనుబాలీయఁ బ్రవాహమై కదలు నా సారస్వతం బిప్పుడా
జననిన్ స్తోత్రము సేయఁగా సఫలమై చైతన్య మొందెన్ ధరన్. 35

౩౬. సకలస్థావర జంగమాత్మక ప్రపంచం బెల్ల శక్తిస్వరూపకమై భాసిలు లోన శక్తి కదలింపన్ బల్కు భక్తుండు, బాలకుఁడైనన్ సతియైన వృద్ధుడయినన్ లక్ష్యమ్మె ప్రాధాన్య, మింతకు పూర్వార్జిత పుణ్యలేశమునఁ జైతన్య స్థితిన్ గాంచెడిన్.

PDF Compressor Pro

# పోతనామాత్యుఁడు

PDF Compressor Pro

# పోతనామాత్యుఁడు

చక్రమ్మునన్ భీష్మ సమయింప ననుకంపఁ
            గుప్పించు, లంఘించు, కులుకు, పలుకు
మందార మకరంద మాధురీ నంప దు
            న్మత్త భక్తిని హత్తు మాట తేట
అని మొన నబలచే, నరి, హరి, నందంద
            నొప్పించు, మెప్పించు, నొప్పు చొప్పు
నడకల, గడుసుపోకడల, నిం తింతయై
            వ్యాపించు, భావసంపదల పొందు
విమల గాంధర్వ నృత్యగీతముల మేళ
నమ్ము గావించు, వేణుగానంపు సొంపు
బ్రహ్మకూకటి ముట్టించుపలుకుఁ జిలుకు
పూజ్య తేజోవిరాజు, మా పోతరాజు.

సాగె సువర్ణముల్, హలపుచాలున గంటపు వాలునన్, మహా
భాగవతమ్ముఁ బూన, కవిపట్టపు రాజగు పోతరాజు నే
సాఁగిలి మ్రొక్కెదన్ విమల సద్గుణశాలికి, రమ్య హాలికో
ద్యోగికి, భోగికిన్, సమతయోగికి, త్యాగికి, వీతరాగికిన్.

PDF Compressor Pro

3 పోతన సత్కవిత్వమును పోతన యుక్తియు, భక్తి, శక్తియున్
పోతన పాండితీగరిమ, పూతచరిత్రుని, భూరి సద్గుణ
వ్రాతము లేమి సెప్ప ! రఘురాము ననుగ్రహపాత్రుడౌ, సుఖో
పేతుని, చిచ్చుభాత్ముని, సువేదుని నామది నెన్నుదున్ సదా

4 వెఱవకు తల్లి ! నీవిడిన భిక్షయె, భాగవతమ్ము దీని ము
ష్కరులకు, నేదియో కడుపు కక్కురితిన్ బలిపెట్ట, నింక నా
తురపడకంచు, వాణియెదఁ దోగెడి కాటుక కంటినీరు పై
చెఱగున నద్ది, బాసయిడు, సిద్ధకవిన్ నినుఁ గాంతు, పోతనా !

5 నరపతు లిచ్చు మన్నన, జనమ్ము లొసంగు యశోధనమ్ము లా
భరణములున్ బురమ్ములును వాహనముల్ కనకమ్ము దివ్య సుం
దర తరలాక్షులున్ మదికి నచ్చవు, మెచ్చవు, భక్తి, మోక్ష వి
స్ఫురణముదక్క యొండు సుఖమున్ మదిఁగోరవు తృప్తిఁబోతనా!

6 బాల రసాలసాల నవపల్లవ కోమల కావ్య కన్య నీ
జాలక యే నృపాలునకు సద్గతి గల్గగ రామచంద్ర భూ
పాలున కార్తరక్షణ కృపా పరిపాలున కిచ్చి మోక్ష ల
క్ష్మీలలనన్ వశీకృతిగఁ జేసికొనన్ జనియించితే ! కవీ !

పలుకుట చిత్రమౌఁ దెలిసి భాగవతోపనిషద్ రహస్యముల్
సులువుగఁ దమ్మిచూలికిని శూలికి నైన బుధాళి పల్కులన్
దెలియఁగ వచ్చినంత కననేరిచి జీర్ణముఁ గొన్న యంత యాం
ధ్రుల కొక భిక్షఁ బెట్టిన నినున్ దెలియన్ వశమయ్య! పోతనా! 7

శరవర్షంబునఁ బార్థు ముంపఁజను భీష్మ ద్రోణ మేఘమ్ము ద్రో
య, రథంబున్ వడి డిగ్గఁగా నుఱుకుచున్ బ్రాణావ శిష్టాత్ముఁడౌ
కరి, నక్ర గ్రహ బాధచే, మొఱయిడన్ గావన్, జనన్ బోవ, ఁద
త్తరపాటేమయ! యొంటికాల్ పరువులెత్తన్ బోయెదే! పోతనా! 8

తక్కుచుఁ దాఱుచున్ వెనుకఁ దక్కుఁచు బ్రక్కకు నొత్తిగిల్లుచున్
నిక్కుచు, నీల్గుచున్, నడుమ నిల్చుచుఁ, జిక్కినటుల్ నటించుచున్
బ్రుక్కడిబంటు, కాలయవనున్ ఘనమోహపుఁ ద్రాటగట్టి నీ
వెక్కడ నేర్చితోయి! సుకవీ! యిటు దాగుడు మూఁత లాడఁగన్. 9

ఆలందోలుట, తూగు టుయ్యెలల, నుయ్యాలాటలన్ దేలుటల్
రేలన్ వెన్నెల సంచరించుట, జలక్రీడల్ వినోదించుటల్
పాలున్ మీగడ జుఱ్ఱు టాదిగల యభ్యాసంబులే! బాల్యపున్
లీలల్, పెద్దవునై స్మృతిన్ విడిచిపోలే విప్పుడున్ బోతనా! 10

PDF Compressor Pro

11 పలుక వినంగరాని బహుబాధల నొందెడి బాలుదేహమున్
నలియని యేరసామృతమునన్ బ్రతికించితి వయ్య! ముద్దుప
ల్కుల మకరంద మొల్కఁగ నకుంఠిత భక్తిమయత్వ మొంది, యాం
ధ్రులు తరియింప నీశ్రుతిగతుల్ కలనోళ్ళను మ్రోగి పోతనా!

12 తనపుట్టిల్లని కాంత, పూరుషుని చిత్తం బత్తవారన్నఁ గ్ర
న్ననఁ బర్వెత్తును లోకమందు, నిజకాంతా సోదరుండంచు నె
మ్మన మందెంచక బావనున్ బరిభవింపన్ జాలెదే! దీన నె
వ్వని సాధ్వీమణి సంతసించి యనుకంపన్ గౌఁగలించున్ గవీ!

13 చిన్నతనంపు నందసుతు చేష్టలె నెమ్మనమందు నాటెనో!
యన్నిటికేమి! యా చలిది యన్నముఁ బచ్చడి యూరగాయలున్
వెన్నలు మెక్కుచున్ జలువ వెన్నెలఁ ద్రిమ్మరె దీవు, పిన్నలన్
బిన్నవు నీవు, పెద్దలనుఁ బెద్దవు, తత్త్వముఁ దెల్పఁ బోతనా!

14 తనయందున్ నిఖిలప్రపంచమున, సత్యంబౌ పరబ్రహ్మమున్
గని, యానందముచే, నొడల్ మఱచి, పల్కన్ లేని, పాల్గారువా
నిని, దండించెడి గట్టిగుండెగల, తండ్రిన్, బల్కెదే! మారువ
ల్కని, యద్వైత విధాన, నీవునొక ప్రహ్లాదుండవే! పోతనా!

PDF Compressor Pro

కమనీయంబగు భూతలంబె శయనాగారమ్ముగాఁ, బట్టువ
స్త్రముగా వల్కల, లిలన్ గరాంజలియె భిక్షాపాత్రగా, మేల్రసా
న్నముగా స్వాదుజలమ్ము, తాపసి కొనున్, దాఁ గొల్వఁ బోనేరఁడెం
దు, మదాంధప్రభు నంచుఁ, బల్కెదవు సంతుష్టుండవై పోతనా! 15

ఇతని ముఖాంబుజమ్ము స్రవియించు, సుధామయవాక్కులన్, మహా
ద్భుతముగ, వెంటలాగికొని పోవు, నదేడకొ! క్షుత్పిపాసలున్
స్మృతిని స్పృశింప వింత, యొక చిన్మయ, దివ్య రసాబ్ధిముంచి, జీ
విత, మిలఁ దెప్పజేసి, నడిపించెడివాడ, వటండ్రు పోతనా! 16

ఇతఁడు శుకుండొ! వ్యాసుఁడొ! గ్రహింపఁగఁ జాలము మాటికిన్ శ్రుతి
స్మృతి హిత సూక్తులన్ వెలికిఁ జిందును తేటతెనుంగునన్ గృపా
మతిఁ దరియింప నాంధ్రి యని మాటికి పల్కుదు, రింట నాంధ్ర భా
రతి తన యాడుబిడ్డయి నిరంతరమున్ జరియింపఁ బోతనా! 17

తన దొక వెఱ్ఱిభక్తి పెడదారినిఁ ద్రొక్కఁడు సూటిఁబోవుఁ బో
తన యని చెప్పుకొంద్రు రసతన్మయతన్ దలమున్కలీదుచున్
జనములు మాటికిన్ నవరస ప్రథితంబగు నీదు పల్కులిం
తని పచియింప శక్యమగునా! పరిపూర్ణుఁడ వీవె! పోతనా! 18

PDF Compressor Pro

19 ఏ రసమైన జిల్కెద వదేయదె మిక్కిలి పుక్కిలింతలై
జారఁగ, దారచే రిపుని సారము ముల్కుల డించునాడు, మం
దార మరంద పాన వశతన్ బసిబాలుని బెంచునాడు, శృం
గారము వీరమున్ఁ గనుల గట్టైదు సత్యముగాగ పోతనా !

20 చను మార్గంబున మధ్య నిల్వఁడు నిరుత్సాహమ్మునుం జెంద, దే
మనునో, తాన యెఱుంగకే పలుకు, భక్త్యావేశుఁడై మాటికిన్
దనుఁబల్కించు విభుండు స్వీయహృదయాంతర్వర్తియౌ రామచం
ద్రుని పల్కుల్ వినిపించు నంద్రు, జను లెందున్ భక్తిమై పోతనా!

21 అల వైకుంఠపురంబునఁ గలుగు సౌధాంత ర్మహాభాగముల్
కలయం ద్రిమ్మఱి, యున్కి కన్పడక బల్కన్‌లేక యున్నంత, న
వ్వల, పర్యంక రమావినోది, యగు రూపం, బక్షరాకారమై
తెలుపన్ దెల్గున రూపుదాల్చినటు లెంతే పల్కితే పోతనా !

22 ఇరువురు తండ్రి బిడ్డలగు హేతువునఁ రఘురామచంద్రుఁడే
యొరవడి దిద్దఁబెట్ట వలయున్ దన పాఠము నప్పగించుటఁ
మఱువ సుతుండు, జాలి, యభిమానము కల్మిని రామభద్రుఁడ
క్షరములఁ బూర్తిజేసె నఁటగా! కరిరక్షణ కేగు తొందఱన్.

PDF Compressor Pro

నిరుపమ భక్తలోక వశునిన్ ఘనయోగి హృదంతరాళ సం
చరణుని రామభద్రు మనసా నెఱనమ్మి కవీంద్రు జిహ్వపైఁ
జరణము లందియిచ్చుట, ప్రసన్నతఁ జూపి యనుగ్రహించు ట
చ్చెఱు,విది మున్ను గంటిమె! వచింపగ వింటిమె! యెందుఁబోతనా! 23

అల వైకుంఠపురమ్మునన్ గలుగు వా రాబాలగోపాల ము
జ్జ్వల వేగమ్మునఁ బర్వులెత్త నడిపింపన్ జాలుదే! మూల మూ
లల విజ్ఞానము, సర్వజీవుల మనో లక్ష్యమ్ము గుర్తించి, కే
వల మాచక్రి తనంతఁ దాన కనుపింపం బల్కెదే! పోతనా! 24

ఎవ్వనిచే జనించు జగ, మెవ్వని లోపల నుండి లీనమై
యెవ్వఁడు వల్కెనంత, "ప్రతియింటను" చిన్నలుఁ బెద్దలాదిగా
బువ్వము నారగించు శిశువుల్ ప్రతినిత్యము పల్కుచుందురో
య వ్విమలాత్ముఁ బ్రార్థనల యందు స్మరింతును నిన్నుఁ బోతనా! 25

ఇందందుం గల, డెంచిచూడవలెగానీ! స్వప్రకాశుండనన్
సందేహం, బిసుమంత లేదని మహోత్సాహమ్మునన్ బల్కె, నా
నందం బొంది, భవ ద్విముక్తపద విన్యాసమ్ములన్ ముగ్ధులై
యిందందున్ జను లాడుచుందురు గదా! ఇంటింట నో పోతనా! 26

PDF Compressor Pro

౨౭ భ్రాంతితొలంగఁ గర్మవిసరమ్మును గ్రక్కున నుక్కడంప, నిం
తింత యనంగరాని, గ్రహియింపఁగ రాని ప్రధాన తత్త్వమే
యంతటఁ దేట తెన్గున, ముదావహమై గ్రహియింపఁ బల్కు, నీ
వింతటి వాడవంచు వచియింపగ, నెవ్వడు చాలుఁ! బోతనా!

౨౮ కలిగెన్ లోతగు భావసంపదయుఁ, బల్కన్ నేర్పు, లెన్నేసి జ
న్మల పున్నెమ్ము! ఫలోన్ముఖంబయి సుధామాధుర్య చైతన్య ధా
రల నానంద రసప్రవాహమయి జారన్, సర్వజీవాళి ని
ర్మల హృత్పద్మము లెల్లలేచి, వికసింపన్ బల్కెదే! పోతనా!

౨౯ లలితంబై రసవంతమై సహృద యాహ్లాదప్రదంబై విరా
జిలు నీకావ్య పుటప్రదీపికగదా శ్రీకృష్ణ లీలాచరి
త్రలు, కృష్ణాహ్వాయ దివ్య తారక పరబ్రహ్మమ్ము నీయింటిలో
పల స్వేచ్ఛన్ విహరించి పల్కుట మహాభాగ్యం బహో! పోతనా!

PDF Compressor Pro

# గోపికాహృదయము

PDF Compressor Pro

PDF Compressor Pro

# గోపికాహృదయము

చెయి విదిలించి యెచ్చటికో, చివ్వున లేచి, చనంగ నేల! నా
పయి నిఁక గోపమా! నిలిచి పల్కు! మదీయ హృదబ్జ సీమ, ని
ర్భయముగ దాటిపోఁగలవురా! దయసేయర! కృష్ణ! యింక వే
బయలు పడంగర, మ్మబలపై నిదె పౌరుషమున్ బలమ్ములున్.

ప్రియుల మనఃప్రవృత్తుల నెఱింగియు, సైపఁగ లేవటోయి! నీ
కయి తొలి జన్మ లెన్ని యిటు వ్యర్థములాయె గదయ్య! యింక నే
మయినదొ ఆయెఁ జేరితివి, హాయిగ సౌఖ్యము లొందరాదె, ని
ర్భయముగ దాచియుంతు,సుకరంబుగ ఱెప్పల తల్పు మూసియుఁన్.

పయి పయి మాటలన్ వెలికిఁ బల్కుటగాదు, యదార్థ మింత, నే
నయి వచియించు టెంతయును, న్యాయముఁగాదు, క్షణక్షణ మ్మదే
ల! యునికిఁ గల్గి యుండినటులన్ జన, నుల్కిపడంగ నేల! నీ
వ యెఱుఁగవొక్కొ! నాహృదయ భావము, నిత్యనివాసివే కదా!

దయగల వాడవంట, ధనధాన్యము లేవియుఁ గోరవంట, భ
క్తియ నినుఁ గట్టునంట, యిల దీనుల పాలిటి భాగ్యమంట, సం
శయము లడంతువంట, మనసా నెఱనమ్మిన వీడవంట, యే
మయ! గుణమేమి లేనియటు లక్కట, మాటికి మచ్చుఁ జల్లెదే!

PDF Compressor Pro

నయమొ! ప్రియమ్మొ! యింక విడనాడకు, నా హృదయాంతరాళ ని
శ్చయమిదె, నిన్నెగా కితరసంగతి నొల్ల, మదీయ జీవితా
శయ మది నీవ, నీకొఱకె, సర్వ సమర్పణఁ జేసితిన్ దయా
మయ! యిఁక, లోనికిన్ మఱలుమా! చలియింపక యేకమై సదా.

విని విననట్టి నీపెడచెవిన్, వినిపింప గలార లేరు ! తాఁ
గని, కననట్టి, లోనొదుగు కన్నుల విప్పఁగ లార లేరు ! కై
కొని, కొననట్టి సూటిపలుకుల్ తరలింపగలార లేర ! లే
మనినఁ బ్రయోజనమ్మొ! గుణమా! యభిమానమ! సంప్రదాయమా!

ఈ విపరీతచిత్రమది యేమొ! యివన్నియుఁగా, విఁకేమియున్
గావని, త్రోసి వైచిన నొకండనె, యేననుచున్ బదేపదే
నా వెనువెంటఁ జుట్టుచు, మనం బలరించెడు నట్టి, నీ వెటుల్
పోవ సమర్థుడౌదొ ! యసమున్ వరియించిన సత్ఫలంబిదే !

గోకుల సార్వభౌమ ! యనఁగూడదుగా నిను లేశమైన నీ
పోకడలన్నియున్ విరియఁ బోసిన వెన్నెల లట్లు, లోకముల్
వాకొనఁ జేకొనన్ గలుగు, భాగ్యము నాయదె యన్న, నింతలో
నాకనుఁ బ్రామి, పోఁదలచినన్ జననిత్తునె ! మేలుకొంటిగా !

కేలఁ గలట్టి వెన్న, తనకే, ద్రవమైన తెలుంగుఁ గానఁగా
జాలని రీతి, దీటగు గజమ్ము కపిత్థ ఫలమ్ము మ్రింగి, తా
నే లవమాత్రమున్ మిగుల నీయక డుల్చిన యట్లు జారిపో
నేలర ! యీప్రయత్నము సహింపఁగ జెల్లునె ! మాయికప్రభూ !

నీకున్ నాకును భేదమింత కలదే ! నీలోన నే నుంటి, నీ
వో కన్పట్టకయుంటి, నాహృదయ విద్యు ద్గహ్వరంబందు, నేఁ
బ్రాకారావృత దేవళంబ, నడుమన్ భాసిల్లు దైవంబ, వీ
వేకాకారత కాదనన్ గలుఁగువాడే యున్న భాషింపుమా !

నీవున్ నేనను భేదముండువర కింతే ! నీవు నీవాడు, నే
నో వేఱైతిని గాన, నేనయితి, నయ్యో, నీవు నే నేకమై
యేవైరుధ్యములేక, తొంటివలె, హాయిన్ వే మహానందమం
దే వర్తించెడి భాగ్య మింకఁ గలదోయీ ! చెప్పుమీ జన్మలో.

ఈ వేదాంతముఁ జెప్పి చెప్పి, మఱి నీవే, యాశ్రయంబంచు సం
భావింపందగు, వస్తువీవనుచు, లోపం బెంచరాదంచు, నే
వేవో ! ధర్మములన్ని మాకొఱకె మ్రోయించెన్గదా ! లోక మా
హా ! విజ్ఞాన మికిట్టులుండవలదా ! యాత్మీయమౌ వస్తులన్ !

PDF Compressor Pro

రాగద్వేషములేని స్వీయకుల ధర్మమ్ముల్, భవ ద్భక్తి సం
యోగారూఢి, నెవండు, నర్పణము సేయుఁ వానికిఁ సర్వముఁ
యోగక్షేమము, లీవటం చనెడు, నా యుక్తుల్ యదార్థంబు; మా
యోగం బిట్టిద, నీవ తెల్పవలె, సంయోగమ్ము, నీలోఁగదా !

ఏవిక్షేపములేని బుద్ధి, తనయందే నిల్పి క్రీడించు, నా
భావాపూర్ణుఁడె ధన్యుఁడౌ నని, వచింపం జాలు వారందఱుఁ
ఈవేదాంతము లేనెఱుంగనివె ! వారే, యీస్థితిం గాంచుచో
నీవాక్యమ్ము లుపన్యసింపఁగలరోయీ ! యోగులుఁ జోగులుఁ.

పోవా ! ప్రేమ గలట్టి వారికడకుఁ మోమోటమిఁ లేకయే
రావా కోరిన వారికిం, దభయు, మా ర్తత్రాణ పారీణ ! నీ
వీవా! నాకును నీవుఁ గాన గతి, గా కెవ్వారిఁకఁ రక్షకుల్!
నీ వాత్సల్య మదేడదాచితివా ! హృన్నీరేజ భద్రాసనా !

ఎంతటి సామరస్యమొ ! గ్రహింప, వచింప, సుఖింప నేనె, నీ
యాంతరమౌట నీస్థితి మహత్త్వములుఁ బ్రకటింపనాయె, నిం
తింతలుఁ గాగ, నావలననే గద! కల్గెఁ బ్రతిష్టనీకు, న
భ్యంతరమేదయా ! స్వరస వాహినికిఁ మనసారఁ జేరఁగా.

PDF Compressor Pro

తెలియంజాలని దొడ్డవాడ వట! యేదీ! 'నేను' లేకెట్లు నిన్
బలుకం జాలు జగమ్ము, నిల్వ నొక కొంపా! గోడియా! నీకు, నా
పలనన్గా ప్రకటీ కృతంబయితి, విశ్వం బెల్ల పేరొంది, నీ
కిల నాధారమునేన, నాకుమఱి నీవే! యెవ్వ రేమనన్.

నా యత్నంబది లేనె లేదు కద! లోనంజేరి ప్రేరేచి, యే
వో! యాడించిన యాటలాడితినె, యేవో పల్కితిౝ విప్పఁగా
నీయంత్రంబది, సాకుఁ జుట్టఁగఁ బ్రయత్నింతే! హరీ! నన్నిటుల్
త్రోయం బూనకు, త్రోసి రాజనకు, నిర్దోషింజుమీ సాక్షిగా.

చాలుం జాలును, గట్టిపెట్టు మిఁక, నాశల్, నానుడుల్ వే వినం
జాలుౝ జాలును, యోగ్యతౝ నిలుపఁగా నాలోపముౝ బల్కుమా!
నాలోపైనను, నీవ తీర్పవలె, లోనం జేరి యున్నాడ, విం
కేలా! సందియమయ్య; నిన్నడుగుఁ బోనివ్వంగఁ జాలౝ బ్రభూ!

నా హృదయంబెఱుంగు, నిజనాథుఁ డెవండిఁక నీవుఁ గాక, సం
దేహము, లోఁగలంచి, యెటుఁ ద్రిప్ప, నటుల్ సుడివారి, నిల్చితిౝ
దేహ మశాశ్వతం, బదియుఁ దీఱినచోఁ దఱియించు టెట్లు! 'దా
సోహ' మటంచు 'సోహ' మనుచుౝ రమియించెద నేకమై సదా.

PDF Compressor Pro

PDF Compressor Pro

# వేఁడికోలు

[illegible]

PDF Compressor Pro

# వేఁడికోలు

అంతట నున్నవాడు హృదయాంతర మందుఁ జెలంగువాడు; కా
లాంతర భేదమున్ గన కహర్నిశమున్ వెలుగొందు వా, డికిం
తంత యనంగరాక, యణువై, ఘనమేరువునై, జగమ్ములై
వింతలు సేయువాడు, కనువిచ్చిన మూసినఁ దోచు నీయెడన్.

ఎటనో బుద్ధికి కంటి కంద కన లూహింపంగ లేనట్టి యె
చ్చటి వైకుంఠము, లక్ష్మితో స్థిరనివాసంబా ! జగ త్పాలనా
నటనా సూత్రధరుండవా ! మఱియు, నానంద స్వరూపుండవా !
యెట సాన్నిధ్యముఁ గల్గునయ్య ! తరమౌనే జన్మజన్మాలకున్.

నీవే మాకయి లేచిరావలయుఁగానీ ! నన్ను రప్పింపఁగా
భావింపన్ శ్రమనీక, దగ్గఱకు రా ! భద్రంబగున్ నాకు నీ
యావాసంబగు నస్మదీయ హృదయాబ్జం బింక నావాడటం
చీవే సర్దుకొనంగ నేకమయి, హాయిన్ జీవనంబేర్పడున్.

ఎందుకు బాధసేతు! వొకచే యిటు, దాగుడు మూతలాడె, దిం
దందన కెందుఁ బాఱెదవయా ! చెలగాటవు పిల్లి కెంతొ, యా
నందము, మూషికంబున కనర్థమటుల్ దలపోయ, నీవు, నా
యందు, రవంత జాలీ తెలియన్ దయసేయుమ ! పట్టుకొందునిన్.

PDF Compressor Pro

ఎందుకు మాయమర్మముల నిందటి బిడ్డలఁ గన్నుఁ బ్రామ, నా
నందము, మాటిమాటి కోక నాటకమాడెద వానఁజూపి, తృ
ప్తిం దనియింపఁ జేయ కోక, తీపి యెదో! కలదంచుఁ జూపి, నీ
క్రిందకు, లాగికొందు వదరే! బహుచిత్రము నీవిలాసముల్.

నాకయి నీవు రాక, కరుణన్ గనబోక, యుపేక్ష సేయుచో
నాకుఁ బనేది చెప్పు, మొకనాటికి వీడని, కంఠ శోషతోఁ
బ్రాకఁగ లాభమే! చెవిటివానికి శంఖపు మ్రోతయట్లు లెం
దాక వచింపు, మోరిమి గనన్ గ్రహియింతువ! యెన్నినాళ్ళకో!

ఎన్నో జన్మము, లిట్టులే మణగిపోయెన్ బైకి రాకుండ నీ
వెన్నండైనఁ గలందు వీడొకఁడు, నిన్నేనమ్మికొన్నాడటం,
చన్నా! మేలగు బుద్ధి, నీ కొదవె నయ్యా! దాచకే చెప్పు! లే
కున్నన్ నీయెడ నమ్మకమ్ముఁ గననౌనో! మిన్న కిట్లుండినన్.

సేవింతున్ గద నేనె కావలసి, నాక్షేమమ్ముఁ జింతించు వా
డీ విశ్వమ్మునఁ గల్గినన్ గదలనీకే పట్ట నూహింపఁగా
నీ వొక్కండవు దక్క, యొండొరులు లేనే లేరటంచున్ వినం
గా, విభ్రాంతుఁడనై, యెటుల్ కదలి పల్కన్ లేక, యూకొంటిగా!

ఐనన్, నీమది కొక్క విన్నపము, సేయంజాల, రూపంబెదో
కానన్ వచ్చిన, లెస్సగాఁ దెలిసి; నాకండ్లార వీక్షింతు, న
త్యానందంబునఁ బొంగి పట్టుకొనఁగా యత్నింతు, నీకెల్ల, స్వా
ధీనంబౌ, నెటువంటికార్య మనుసంధింపంగఁ, గృష్ణ ప్రభూ!

PDF Compressor Pro

# శ్రద్ధాంజలి

[illegible]

PDF Compressor Pro

# * శ్రద్ధాంజలి

ఔర ! కఱంగి పోయెను గదయ్య, యిదే మన తెల్గు పల్కు బం
గారపుకొండ, తాఁ గరఁగి, కాంతులఁ జిల్కెడి రత్నరాజి చే
కూఱఁగ వెగ్గె, విశ్వకవి కోకిల మంజుల కంఠ విస్ఫురత్
హారములన్ మనోజ్ఞ హృదయాంచిత దివ్య కళా ప్రపూర్ణమై.

తఱుగం జాలని దొడ్డకొండ యిది కాదా ! కాలగర్భంబునన్
గరగెన్ రూపులు పెక్కు తాల్పనిదె;యొక్కండైన నీయాత్మకున్
మరణం బెక్కడి దాంధ్రికిన్ యశము నింపన్ బూనితో, సత్కవీ
శ్వర ! కామేశ్వరి జిహ్వపైన నటియింపన్ లోటు నీకున్నదే !

తిరుపతి వేంకటేశ్వరులె, దేశికులై చనఁ బేరుఁ జెంది రెం
దఱొ; మనవేంకటేశ్వరుఁ డెదం గొనఁ దా, నతఁడే యనన్ ప్రభా
కరుఁ డన, విశ్వనాథుఁ డనఁ గాంతుఁ డనన్ శివరాము డంచు నం
దఱి యెడ నన్నిరూపులఁ గనందగు నాతఁడు వేంకటేశుఁడే !

---

* శతావధాని చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి గారు
దివంగతులైనప్పుడు వ్రాసిన పద్యములు.

PDF Compressor Pro

తిరుపతి వేంకటేశ్వరుఁడె, దేవుఁడెగా, కలి నిప్పుడంతటన్
గరము కలమ్ముఁ బూను మొనగాడగు, నేకవికైన, వేంకటే
శ్వరునిఁ దలంపకే, కలము సాగదు నూగదు, చేతఁ బట్టి, తా
నుఱవడి చాళ్ళు వెట్టగ మహోదయమౌ, తెనుగుం బొలమ్మునన్.

ఇతఁడొక కాలవేది, చెవికింత వినంబడి నట్టి పల్కు సం
గతి గ్రహియించి, ప్రేమఁ జిలుకన్ బలుకున్ గద తానె ముందనా
గత విషయమ్ములన్ దెలియఁగా, నిత డెంత సమర్థుఁడో గదా!
ఇతఁడు కవీంద్రుఁడై మనుజుమీ! యను దీవన చూడ్కి నింపుచున్.

ఏనుంగు నెక్కిన ట్లేవచియింతు రిం
తింత లేసి కవీంద్రు లెవని కతన
రామశబ్ద మెఱుంగరాని సామాన్యుఁడున్
గవిత నల్లఁగ నేర్చె నెవని కతన
అష్టావధాన, శతావధానమ్ములుఁ
బ్రాకె నింటింట, నెవ్వాని కతన
అర్హత లేకయే యాశింతు రితరు, లా
స్థాన కవిపద మెవ్వాని కతన
కవియె సుఖి, చిరంజీవి, మేల్కవి యటంచు
సుకరముగఁ బల్కు పద్యసాధకులు తఱచు
కూనరాగమ్ముఁ దీతు రెవ్వాని కతన
నట్టి కవిభోజుఁ డిప్పు డేపట్టుఁ జేరె!

PDF Compressor Pro

ప్రావీణ్యంబది కల్గు నొక్కొకరి కౌరా ! నూటికిన్ గోటికే
వో విద్యల్, శ్రమనేర్చి పల్కుదు రవేవో పండితుల్; వారి ప
ల్కే వేరయ్య; విన న్విన న్మధురమై గిల్గింతల న్గొల్పెడిన్
'బావా! యెప్పుడు వచ్చితీ!' వనెడి నీపల్కేదయా ! లేదయా !

పద్య మల్లినట్టి వాడెల్ల కవిగాడు
సత్కవీంద్రుఁ డనఁగ, శతవధాని
చెలగి నీవు చేయు చేవ్రాలు క్రింద నీ
'శతవధాని' బిరుదు సార్థకంబ.

గుండెల్ ఝల్లననూరిపోసెగద, పల్కుల్ ముల్కులై | యంతటన్
నిండన్, భారతనాటకంబులఁ బురాణింపన్ దలంపుంచి యా
తండేగా, నిలబెట్టె నాకవిత యాంధ్రంబందు మార్మ్రోగు, నా
"జెండాపై కపిరాజు" లేదు గద ! యిస్సీ ! జన్మజన్మాలకున్ !

PDF Compressor Pro

PDF Compressor Pro

# గ్రహస్తవము

[illegible]

PDF Compressor Pro

# గ్రహ స్తవము

అహమున్ సేయు విధాఁత, జీవులకు ప్రాణాధారమౌ వేల్పు, ప
ద్మహితుం, డాశ్రిత బాంధవుండు, శుభకర్మ ప్రోక్తయున్ సాక్షియున్
గ్రహరాట్ మిత్రుఁడు, నాత్మకారకుఁడునై రాజిల్లు సూర్యుం, డను
గ్రహమున్ గూర్చుత నాపయిన్ నిరతమున్ రాజ్యప్రదుండై ధరన్. 1

అమృతకరుండు, సస్యముల కాదరువున్, సిరి, పాడి, పంట, సౌ
ఖ్యమును, శుభమ్ము, సత్కవిత, నాయువు, సంతతి,స్వీయమాతృసౌ
ఖ్యము, నొడగూర్చు, రేవెలుఁగునై వెలుగొందు కళాప్రపూర్ణుఁ డు
ల్లము వికసింపఁ గాంతులఁ జెలంగ ననున్ దయనేలు గావుతన్. 2

అధికారమ్ము బలమ్ముఁ దేజమును శౌర్యమ్మున్ మహాధైర్యమున్
బృథివిన్ సోదరవృద్ధియున్ గృహములున్ వేదప్రబోధస్థితిన్
రథ దివ్యాశ్వభటాదికమ్ము లొనగూర్పన్ భౌము డస్మన్ మనో
రథ, మీడేర్చు సదా జయప్రదుఁడునై, రాజ్యప్రదుండై భువిన్, 3

వాపీకూప తటాకముల్, వనములున్, భాగ్యమ్ము, సంచారమున్
రూపున్, బ్రజ్ఞయు, ధీ, యశమ్ము, మహదారోగ్యమ్ము సౌధాళి, భా
షాపాండిత్య మొసంగు రాహు విల సూక్ష్మజ్ఞాన సంపత్తు మేల్
ప్రాపున్ గూర్చుత సర్వశక్తి యుతుఁడై రంజింపఁ జేయన్ ననున్. 4

PDF Compressor Pro

5 గురుతర బుద్ధి సంపద, యకుంఠిత దీక్ష, సుతాది బాంధవుల్,
సురుచిర భోగభాగ్యములు, శుద్ధమనమ్ము, గృహాదిసౌఖ్యముల్,
సిరియునుఁ బాడి పంటయుఁ, ప్రసిద్ధకవిత్వము, ప్రాణ మిచ్చు స
ద్గురుఁ డిడుగాత నాకు దయతో ప్రతనిత్య మభీష్టసంపదల్,

6 తఱుగని పాడి పంటయును, దాలిమి, యోజన, విష్ణుభక్తియున్
స్థిరతర భూమిసంపదయు, దేహపటుత్వము, సుప్రభుత్వమున్
దిరమగు నాయువున్, సకలతీర్థనివాసము, త్యాగ మిచ్చు భా
స్కరసుతుఁ డస్మదీయ మగు కామితముల్ నెరవేర్చు గావుతన్.

7 నీతి విశారదుండు, ధరణీసుర పూజిత పండితుండు, శ్రీ
మాతల కారకుండు, బుధమాన్యుఁడు, మాంత్రిక తత్త్వవేదియున్
జ్యోతిష శాస్త్ర వేత్త యగుచున్ విలసిల్లు బుధుండు, జ్ఞానము
ద్యోతకమై తరించెడి, సుయోగ మొసంగుత నాకు నిత్యమున్.

8 ఘనమౌ, సద్గురు దేవపూజన, నమస్కారమ్ము, మృష్టాన్న భో
జనమున్, దీర్ఘనివాసమున్, భువనసంచారమ్ము, శ్రీశైవ భ
క్తి, నిడంగాఁగల, కేతు వెప్పుఁ డనురక్తిన్ ప్రోచుతన్, నిత్యము
క్తి నిధానంబగు జ్ఞానమిచ్చి ననుఁ దృప్తిన్ దేలియాడించుచున్.

సురపుర భోగ భాగ్యములు, సుందరచందన దివ్యభూషణాం
బరములు, సత్త్వ విత్వము, శుభమ్ము,యశమ్మును, ధైర్యహార్యముల్
సురుచిర సత్కళత్ర, సుతులన్ సమకూర్చెడి, భార్గవుండు, భా
సురముగ నిష్టమూర్తి యగుచున్ ననుఁ బ్రోచు నభీష్టసంపదన్. ౧

భువనములన్ సృజింపఁగ, సుపోషణఁ జేయ, లయంబొనర్ప నౌ
రవియు,శశాంకుఁడున్,గుజుఁడు,రాహువు,దేవగురుండు,సౌరి, కై
రవహితసూనుడున్, శిఖియు, రాజిత భార్గవుఁడున్ సమస్త వై
భవము లొసంగి ప్రోచుత కృపన్ ననుఁ దా మనుకూల దృక్కులన్. ౧౦

PDF Compressor Pro

PDF Compressor Pro

# కల్పలత

PDF Compressor Pro

PDF Compressor Pro

# సమర్పణ

కొలిచినఁ గల్గు దేవతలకున్ దయ, యా పితృదేవతావళిన్
దలచిన వంశవృద్ధియగుఁ దామర తంపర వోలె, దట్టమై
మొలిచిన వంశభూజమటు పూచిన తంగెడు భంగి మాకొలం
బెలమి వహింపఁ 'గల్పలత' నిచ్చెద మా పితృదేవతాళికిన్.

PDF Compressor Pro

# కల్పలత

అది నడురేయి హాయిగ విహంగ తరు ప్రచయమ్ము గూడ, నె
మ్మదిగ సుషుప్తిలో మునిగి మాటు మడంగిన రీతి శాంతి గొ
న్నది, యుడురాజి మింట చలనం బరిచూచెడునట్టి వేళఁ, దా
నొదిగిపరుండి యుండె జనుఁడొక్కఁడు తల్పమునన్ గృహమ్మునన్. 1

అతఁడఁటు నిద్రజెందు సమయమ్మున, జివ్వున మేలుకాంచి య
ద్భుతముగ నిద్రమై సగము మూసిన కన్నుల నారవిచ్చి ది
గ్వితతిని పాఱజూచి, తెలివిన్ గ్రహియించి, యిదెల్ల స్వప్నసం
గతి యని తల్లికిం దెలియఁగా, వచియింప దొడంగె నంతటన్, 2

అమ్మా! నే కలగంటి నొక్కటి, భయంబౌ, నూహసేయన్ విచి
త్రమ్మౌ! ప్రాయపు వైష్ణవుండొకఁడు, నిద్రం జెందు, నన్ దట్టి లే
లెమ్మోయీ! ప్రసవార్తయైన సతి, జాలిం గుందెడిన్, వెంట రా
రమ్మోయీ! చనుచుంటి నే దదవనార్థమ్మంచు శీఘ్రమ్మునన్. 3

తెల్లని నామమున్ సరిగ దీర్చిన కస్తురి బొట్టు మోము ను
త్ఫుల్ల సరోజనేత్ర యుగమున్, జిరుబొజ్జయు, నీలికాంతి రం
జిల్లెడి, మేనునై, కనకచేలము దాలిచి, వేత్ర పాణియై
తల్లి! యతండు, కన్మొఱఁగి తాఁ జనెఁ దూరుపు మోముగా వెసన్. 4

PDF Compressor Pro

5 సిగముడి వీడి యూడఁ బయిచేలము గాలికిఁ దూలియాడ, వా
యు గమన వేగియై కరము లూపుచు, పాదము లూని తీయుచే
యగపడరాక, ఆర్తభరణాదృతిఁ బ్రాగ్ధిశకున్ జనంగఁ గ
న్నుగవ నిగిడ్చి, మిన్నక కనుంగొనుచుంటి, మొఱంగు సంతకున్.

6 కలయో! వైష్ణవ మాయయొ!
తెలియద, తద్రూప మెల్లఁ దెల్లముగా, గ
న్నులఁ గట్టినట్టు, లమ్మా
టలు వీనుల మ్రోగిన ట్లెడంద, చలించున్.

7 పురుడు పోసికొనఁగ పుట్టింటి కేగిన
కోడలిం దలంప గుండె చెదరు
అనుచు భీతిజెందు నాత్మజు గనుగొని
భయము వాయఁ దల్లి పలికె నిట్లు.

8 "భయపడ నేల తండ్రి! మనపాలిటి దైవము నేటి కీ విధిన్
దయ బ్రసరింప నీకు బ్రియదర్శనమిచ్చి యనుగ్రహించె ని
శ్చయముగ నెద్దియో శుభము, సన్నిహితంబయి యుండె స్వప్నమా
రయ, మన వంశభూజము, ఫలప్రదమౌ నటు గానుపించెడిన్.

PDF Compressor Pro

ఆ నిర్హేతుక జాయమాన కరుణా యత్తైక చిత్తుండు, ల
క్ష్మీనారాయణు డాదినుండి, మనకున్ సేమమ్మె, సేకూర్చు చో
నీ నా డిట్టు లనుగ్రహించుటలు, తండ్రీ! వింతలే! తొల్లి సం
తానార్థమ్ముఁ దపించి, నేపడిన బాధల్ చెప్పఁగా, శక్యమే ! 9

కన్నకన్న వేల్పుల మ్రొక్కి, విన్నవిన్న
వ్రతము లెల్లనునోచ, తీర్థముల గ్రుంక
ప్రాయ ముడిగెడి వేళ నాపాలి పంట
వగుచు గడుపున బడితి వోయన్న నీవు. 10

అన పత్యుండయి పెద్దకాలమును, చింతాక్రాంతుడై యున్న నీ
జనకుండున్ దుది కన్నులార సుతు నాస్యమ్మున్ విలోకింపకే
తనయా! యీహతభాగ్య డించి చనియెన్, తద్దుఃఖభారమ్ము నా
త్మను, గర్భమ్మున నిన్ను, దాల్చితి నెటో, దైవమ్ము నిందించుచున్. 11

వినుము కుమార ! తాఁ దనువువీడుట నిశ్చయ మంచు నెంచి తో
డనె యవసానపున్ గడియ డాయుట నాత్మఁ దలంచి: ప్రక్కపై
గనులను బాష్పముల్ గురియఁగా విలపించెడి నన్నుగాంచి నీ
జనకుడు పల్కె నిట్టుల "విచారము నొందెదవేల బేలవై ? 12

PDF Compressor Pro

13 మనకున్ వంశము నిల్ప పుత్రుఁ డుదయింపన్ వచ్చు నీ గర్భమం
దున, నిప్పట్టున, వేఱయైన, నొక దత్తుం దెచ్చి వంశాబ్ధిచం
ద్రుని గావించి, పితౄణమున్ గడుపు, మార్యుల్ మెచ్చి దీవింప నా
తనయున్ గన్నులఁ జూచుకొమ్మ! మది వంతల్ మానునే, ఁబోయెదన్."

14 అని పల్కుచు నసువుల బా
సెను జనకుం డీశ్వరేచ్ఛ జింతింపుచు, నో
తనయ! నిను గంటి, హరికృప
మనపాలం గల్గి నిన్ను మనిచిన దిట్టుల్.

15 నాతొలినోము పంటవయి, నాకనుదోయి వెలుంగు వైన నిన్
బ్రీతి యెలర్ప బెంచితినిఁ బెద్దయొనర్చితిఁ బెండ్లి జేసితిన్
నాతియు, నీవటుల్ గృహమునన్ జిలుకా గోరువంకలై, మిథః
ప్రీతి మెలంగు పోడుములు పెంచిన వెన్ని మనోరథమ్ములో!

16 కుతుకమారగూర, కోడలి కడుపును
పండె, నంకతలము నిండె నాకు
చిట్టి మనుమరాండ్రఁ జిన్నారి మనుమల
తోడ, నిల్లు దోసతోట యయ్యె.

PDF Compressor Pro

పెద్దమనుమడు నీతండ్రి పేరి వాని
పొలతి నీ పెద్దకోడలు, పుట్టినింట
దౌహృదము నిండి, నీరాడు తరుణమాయె
వచ్చు నేడెల్లియో శుభవార్త మనకు. 17

కలలు కల్లలు గావోయి, వలదు భీతి
నాకు మునిమనుమండును, నీకు మనుమ
డుదయమందుట తథ్యమ్ము, సదయుడైన
నాటి దేవుండు నేడు నున్నాడు కాడె! 18

చిత్ర మిదెల్ల నేతపము జేసితిమో! తొలిబాము నందు, లో
కత్రయ నేత, యిట్లు కల గన్పడు టెంతటి వారి కబ్బు! నీ
పౌత్రుని బిల్చికొందము శుభంకరుఁడౌ నిలువేల్పు పేర, నీ
గోత్రము విస్తరించి వెలుఁగున్ గలకాలము తద్దయాప్తిచే. 19

ద్వారమ్ముఁ దెఱువ ప్రత్యక్ష దర్శనమిచ్చి
శ్రీఁగంటఁ గను చెన్నకేశవుండు
అనుదిన ఘటసహస్రాభిషేకోత్సవుం
డేలు పూర్వాళ సోమేశ్వరుండు

PDF Compressor Pro

తరతరంబుల నుండి తరుగని మనపాలి
పంట కామేశ్వరి యింటివేల్పు
ప్రాభవ రక్షణా పరతంత్రమై, యెల్ల
దిశల నిల్చెడి పితృదేవతాళి,

ప్రకటి తానంద భోగ సంపత్కటాక్ష
వీక్షణ ప్రసారముల గావించు చుండ
నీకు భయమేల నాతండ్రి! నిఖిలరక్ష
ణమ్ము గల్గిన యట్టి గృహమ్ము మనది. 20

పలు పల్కులేల సద్యః
ఫలితంబిడు, స్వప్నమిది, శుభప్రద'' మనుచున్
పలుగతుల తల్లి సుతునకు
దెలుపుచు నుండంగఁ దూర్పు తెలతెల వారెన్. 21

''మునిమనుమడు కల్గెను, న
ర్ధ నిశీధము నందు నీకు తల్లీ!'' యనుచున్
మనుజుఁ డెవండో వాకిట
వినుచుచు నున్నట్టి వార్త వీనుల బడియెన్. 22

PDF Compressor Pro



కల్పలత